విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 సంచిక :89 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ బుధవారం 19 ఆగస్టు 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

- ట్రంప్ పోస్ట్ నేపథ్యంలో ఈసీ కీలక ప్రకటన!
- దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- ఈసీ కీలక ప్రకటన- ఓటర్ ఐడీల ప్రాధాన్యతను వివరిస్తూ ట్రంప్ భారత్‌ను ఉదాహరణగా చూపడంతో వివరాల్ని వెల్లడించిన ఈసీ




## 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'


- ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతటి చర్యలకైనా సిద్ధమన్న కేంద్రం
- 26/11 ముంబయి దాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా
- నిందితులు లేకున్నా విచారణ ప్రారంభం
- ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారత లక్ష్యమని ఎంఈఏ స్పష్టం





## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- ఇదే సరైన మార్గం: రాహుల్ గాంధీ
- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి



### స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే

## విజయానికి మూలం

- పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం
- చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్
- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

**అమరావతి**

ూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో ్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ ్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి ంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి


వివరాలు 2లో..


## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల

# ఎన్నికలు

- బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలే ప్రధాన అజెండాగా భేటీ
- పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ



**అమరావతి**

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని


వివరాలు 2లో..





## విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

- విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాల్సిందేనన్న కాక్రోచ్ జనతా పార్టీ
- కోర్టు అడిగిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమే

## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే

# చరిత్రహీనులే

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహణ
- గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శ
- రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కి పెంచాలని నిర్ణయం



**అమరావతి**

రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, ు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు ంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం ర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక యాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర ంచవని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ ర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను డగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు. ల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం ాడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. మీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో


వివరాలు 2లో..


## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు
- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



## ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను

# ప్రోత్సహిస్తున్నాయి

- మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి
- విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలను పదేపదే అవమానిస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ ఒక పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడని ఎద్దేవా
- యువత ఆకాంక్షలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచన



**అమరావతి**

దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానపరుస్తోందని


వివరాలు 2లో..


# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

### గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.



### బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక


తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్నికలు తక్షణావసరం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# లోకల్ బాడీ ఎన్నికల ఫీవర్


**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను ఏ విధానంలో నిర్వహించాలనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈవీఎంల కంటే బ్యాలెట్ పేపర్ విధానానికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.స్థానిక ఎన్నికలకు అవసరమైన స్థాయిలో ఈవీఎంలు అందుబాటులో లేకపోవడం బ్యాలెట్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బ్యాలెట్ విధానంలో ఓటరు అభ్యర్థుల గుర్తులు, పేర్లను చూసి తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాల్సి ఉంటుంది. అందువల్ల అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, గ్రామంలో చేసిన పని, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఓటింగ్ విధానం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల బలం, పార్టీ సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. బ్యాలెట్ విధానం తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే గ్రామస్థాయిలో ఓటర్లు తమ ప్రాంతానికి ఎవరు మెరుగైన సేవలు అందించగలరనే విషయాన్ని ప్రధానంగా పరిశీలించే అవకాశం ఉంది.కూటమి విషయానికి వస్తే సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతోందనే ప్రచారం



ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కూటమి సమన్వయం కూడా ఎన్నికల సమయంలో కీలకంగా మారవచ్చు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీరు, విద్య, ఉపాధి వంటి స్థానిక అవసరాలపై ప్రజల దృష్టి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పనులు తమ ప్రాంతానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో ఓటర్లు అంచనా వేసే అవకాశం ఉంది. అదే సమయంలో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల బ్యాలెట్ విధానం అమలైతే ఒక పార్టీకి స్వయంచాలకంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పడం కష్టం. ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది చివరకు ప్రజల తీర్పే. గ్రామస్థాయిలో తమకు దగ్గరగా ఉన్న సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే అంశమే ఓటర్ల నిర్ణయంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది అన్న విషయం పై సర్వత్ర ఉత్కంఠత నెలకొంది..

# చంద్రుడిపై శాశ్వత అడుగులు

**విజయవాడ :** చంద్రుడిపై మనిషి ఎక్కువకాలం నివసించగలడా? అక్కడే ఉండి పరిశోధనలు చేయడం, అవసరమైన వనరులను వినియోగించుకోవడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ అమెరికా అంతరిక్ష సంస్థ కీలక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దశలవారీగా ఏర్పాటు చేసి, భవిష్యత్‌లో అక్కడ దీర్ఘకాలిక మానవ ఉనికికి పునాది వేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. నాసా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2029-32 మధ్య ప్రారంభ నివాస సదుపాయాలను ఏర్పాటు చేసి, 2032 తర్వాత చంద్రుడిపై నిరంతర మానవ కార్యకలాపాలను విస్తరించనుంది చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రేడియేషన్, చంద్ర రాత్రుల్లో విద్యుత్ కొరత, భూమి నుంచి దూరం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే రోవర్లు, ల్యాండర్లు, డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస మాడ్యూళ్లను దశలవారీగా చంద్రుడిపైకి పంపి వాటి పనితీరును పరీక్షించాలని నాసా భావిస్తోంది.మూన్ బేస్‌కు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు. శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో నీటి మంచు ఉండే అవకాశం ఉంది. నీటిని భవిష్యత్‌లో తాగునీరు, ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి వనరుల కోసం ఉపయోగించగలిగితే చంద్రుడిపై దీర్ఘకాలిక మానవ నివాసానికి అది కీలకంగా మారుతుంది.ఇక్కడే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.



చంద్రయాన్-2లోని పరికరం చంద్రుడి ధ్రువ ప్రాంతాలను రాడార్ ద్వారా అధ్యయనం చేసింది. 2026లో ఇస్రో వెల్లడించిన తాజా పరిశోధన ప్రకారం.. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని కొన్ని శాశ్వత నీడ ప్రాంతాల్లోని నాలుగు క్రేటర్ల అడుగుభాగాల్లో ఉపరితలానికి దిగువన నీటి మంచు ఉండే అవకాశాన్ని రాడార్ పరిశీలనలు సూచించాయి. చంద్రయాన్-2 డేటా ఆధారంగా ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి ధ్రువ ప్రాంతాల్లో నీటి మంచు, ఉపరితల స్వభావం, ఇతర భౌతిక లక్షణాలకు సంబంధించిన కీలక డేటాను రూపొందించారు. భవిష్యత్ చంద్ర మిషన్ల ల్యాండింగ్ ప్రాంతాల ఎంపికకు ఈ సమాచారం ఉపయోగపడే అవకాశం ఉంది.నాసా ప్రణాళిక ప్రకారం తొలి దశలో రోవర్లు, ల్యాండర్లు, ఇతర రోబోటిక్ వ్యవస్థలు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశీలిస్తాయి. అనంతరం 2029 నుంచి సెమీ-పర్మినెంట్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస సదుపాయాల ఏర్పాటు ప్రారంభమవుతుంది. ఈ దశలో భారీ మొత్తంలో కార్గోను చంద్రుడిపైకి పంపేందుకు అనేక ల్యాండర్ మిషన్లను ఉపయోగించనున్నారు2032 తర్వాతి దశలో మాత్రం లక్ష్యం మరింత పెద్దది. వ్యోమగాములు చంద్రుడిపై ఎక్కువకాలం నివసించి పనిచేసేలా సెమీ-పర్మినెంట్ హ్యాబిటేషన్ మాడ్యూళ్లు, దీర్ఘకాలిక విద్యుత్ వ్యవస్థలు, ప్రెషరైజ్డ్ రోవర్లు, నిరంతర సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నాసా భావిస్తోంది. ఈ మూన్ బేస్ భవిష్యత్‌లో అంగారకుడి వంటి సుదూర గ్రహాల మిషన్లకు శిక్షణ, పరిశోధన, సాంకేతిక పరీక్షల కేంద్రంగా ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ప్రస్తుతం నాసా అధికారిక ప్రణాళికలో 2027లో ఆర్టెమిస్-3 ద్వారా నేరుగా చంద్రుడిపై మానవులు దిగడం కాకుండా, ఆ మిషన్‌ను భూమి కక్ష్యలో కీలక వ్యవస్థల పరీక్షలకు ఉపయోగించనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి తొలి ప్రణాళికాబద్ధమైన మానవ ల్యాండింగ్ ఆర్టెమిస్-4తో 2028లో జరగనుంది.చంద్రుడిపై మానవాళి దీర్ఘకాలిక ఉనికికి అడుగులు పడుతున్న వేళ.. ఇస్రో అందిస్తున్న చంద్ర ధ్రువ ప్రాంత డేటా, నీటి మంచిపై పరిశోధనలు, భవిష్యత్ చంద్ర మిషన్లకు భారత్ కీలక భాగస్వామిగా నిలిచే అవకాశాన్ని పెంచుతున్నాయి. చంద్రుడిపై మొదలయ్యే ఈ కొత్త అధ్యాయం.. చివరికి అంగారకుడిపై మనిషి అడుగుపెట్టే ప్రయాణానికి మరో పెద్ద మెట్టుగా మారనుంది.

## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం:**

ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ విద్యార్థులకు ××-జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టొద్దు: మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయి

-మొదటిపేజీ తరువాయి

నితిన్ నబిన్ విమర్శించారు. "పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

## స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలం

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## మాజీ మంత్రి కుమారుడికి పెళ్లి ఇష్టం లేదా.. సోషల్ మీడియాలో వైరల్!

**విజయవాడ :** వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై సొంత కోడలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కుటుంబ వ్యవహారం కాస్త రచ్చకు దారితీసింది. ఆ కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు కేసు నమోదు కూడా చేశారు. ఒకవైపు ఈ కేసు విచారణ కొనసాగుతుండగా.. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబ సభ్యుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడికి ఇష్టం లేని పెళ్లి చేశారని వెలుగు చూస్తోంది ఆ వీడియోలో. ఏకంగా జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదన్నట్టు చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనవసరంగా తనను ఒత్తిడి చేసి పెళ్లి చేయించారని ఆయన మాట్లాడుతున్న అంశాలకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది.మొన్న మధ్యన మాజీమంత్రి జోగి రమేష్ కుటుంబం పై ఆయన కోడలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తన అత్తవారు ఇంట తనకు మానసికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. తీవ్రంగా హింసిస్తున్నారని.. గృహ హింసకు పాల్పడ్డారని.. ఒకటి రెండుసార్లు హత్య ప్రయత్నం చేశారని ఆమె ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే జోగి రమేష్ మాజీ మంత్రి కావడం.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కావడం తీవ్ర చర్చకు దారితీసింది. పైగా ఆమె తెలంగాణకు చెందిన యువతి కావడంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది ఈ ఘటన. అయితే దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్ కుటుంబ సభ్యులు. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న వ్యవహారాలతోనే బాధితురాలు బయటకు వచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. కేవలం జోగి రమేష్ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు సమీప బంధువులు 11 మంది తనపై వేధింపులకు గురి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి నిందితుల్లో ఒకడైన జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. కుటుంబ సభ్యుల బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పించారని చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైన తర్వాత జోగి రమేష్ కోడలి కుటుంబ సభ్యులకు జరిగిన చర్చలు బయటకు వచ్చాయి. అసలు తనకు ఈ వివాహం ఇష్టం లేదని.. అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జాము వరకు తనకు వైట్ వాష్ చేశారని.. బలవంతంగా ఒప్పించారంటూ జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తండ్రి పై తిరగబడుతున్న వీడియోలకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు బయటకు వచ్చాయి.. అయితే ఆ కుటుంబంలో అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే సొంత కుటుంబ సభ్యులే ఈ వీడియో లీక్ చేశారని అర్థం అవుతోంది. కాగా ఈ సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

## ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎర్రకోట రాజీవ్ రెడ్డి

**నందవరం:** మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# మాతృభాష తెలుగును పరి రక్షించేందుకు విద్యావ్యవస్థలో మార్పులు అవసరం యార్లగడ్డ.

- తెలుగు భాష అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు.
- విద్యారంగంలో మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు.
- గత 10 వ తరగతి పరీక్షల్లో తెలుగులో 37 వేల మంది విద్యార్థులు ఫెయిల్ కావడం ఆందోళనకరం.
- తెలుగులోనూ ఎక్కువ మార్కులు సాధించేలా పరీక్షా విధానంలో మార్పులు చేయాలి.
- విద్యావేత్తలు, ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేసి తెలుగు బోధనలో మార్పులు తీసుకురావాలి.
- భవిష్యత్ తరాలకు మాతృభాషను అందించాల్సిన బాధ్యత అందరి పైనా ఉంది యార్లగడ్డ.



**అమరావతి, ఆగస్ట్ 18:** మాతృభాష తెలుగును పరి రక్షించడం కోసం విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను అభినందించారు. ముఖ్యమంత్రి తెలుగు భాష అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టుల భర్తీ చేయటం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత విద్య, స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ బోధన వంటి ఆధునిక విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలు 85.25 శాతానికి చేరుకోవడం, ప్రైవేటు పాఠశాలల నుంచి లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ఈ మార్పుకు నిదర్శనమన్నారు. అయితే రాష్ట్రంలో తెలుగు భాష పరిస్థితి పై యార్లగడ్డ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తెలుగు మాట్లాడగలుగుతున్నా చదవడం, రాయడం రాని పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకునే అవకాశం తగ్గిపోవడం కూడా ఇందుకు ఒక కారణమని చెప్పారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులను ఇతర భాషల వైపు మళ్లిస్తున్నాయని పేర్కొన్నారు. మాతృభాషలో విద్యార్థుల ప్రావీణ్యం తగ్గిపోతున్న విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. పదో తరగతి పరీక్షల్లో తెలుగులో 37,679 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారని, అదే సమయంలో హిందీలో 1,436 మంది, ఆంగ్లంలో సుమారు 8,771 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారని తెలిపారు. మాతృభాష లోనే ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు వెనుకబడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. తెలుగు భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధనా విధానంలో మార్పులు తీసుకురావాలని సూచించారు. గణితం, సైన్స్ మాదిరిగానే తెలుగు లోనూ విద్యార్థులు 99 మార్కులు సాధించేలా ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షా విధానంలో మార్పులు చేయాలని కోరారు. వ్యాకరణం, క్లిష్టమైన పద్యాలకే పరిమితం కాకుండా గిడుగు రామమూర్తి పంతులు సూచించిన వ్యవహారిక భాషకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠ్యాంశాలను మార్చాలని యార్లగడ్డ సూచించారు. విద్యావేత్తలు, తెలుగు ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తెలుగు బోధనలో అవసర మైన మార్పుల పై అధ్యయనం చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్ తరాలకు మాతృభాషను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని, విద్యతోపాటు తెలుగు భాష, సంస్కృతి పరి రక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని అసెంబ్లీ వేదికగా యార్లగడ్డ వెంకట్రావు కోరారు.

# సామాజిక భద్రతలో భాగంగా అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్





- పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక సాయం కింద పెన్షన్ పథకాన్ని అమలు.
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు కలెక్టర్ విజయ కృష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 18:** అర్హులైన వారికి పెన్షన్లు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక పింఛన్ల పంపిణీ గూర్చి అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక సమస్యల వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల పై కారణాలు తెలిసినప్పటికీ, తగిన చర్యలు తీసుకోక పోవడం పై జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించడానికి పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. డి.ఆర్.డి.ఎ., పి.డి, కె.శచీదేవి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దాదాపు 7,000 నంబర్లకు సంబంధించిన ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి, వచ్చే వారం నాటికి పూర్తిస్థాయి జీఎస్ స్టేట్ మెంట్ సమర్పించాలని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎంపీడీఓలు, సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా లబ్ధిదారులందరికీ క్రమం తప్పకుండా పెన్షన్ అందేలా చూడాలి. పెన్షన్ పంపిణీకి ముందు రోజు రాత్రే పీడీవో లతో సమావేశం నిర్వహించి, కేటాయించిన లబ్ధిదారులందరికీ ఫోన్ కాల్స్ ద్వారా సమాచారం అందించాలని, ఫోన్ నంబర్ల నవీకరణ చేయలని తెలిపారు. మొత్తం 7,221 మంది పెన్షనర్ల ఫోన్ నంబర్లు డేటాబేస్‌లో అప్‌డేట్ కాకపోవడం పై నిరాశ వ్యక్తం చేశారు. ముఖ్యంగా వి.మాడుగుల (644), నాతవరం (573), చోడవరం (497) మండలాల్లో అధిక సంఖ్యలో పెండింగ్ ఉన్నాయని, ఎంపీడీవోలు తక్షణమే స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని ఫోన్ నంబర్లను తనిఖీ చేసి అప్‌డేట్ చేయాలన్నారు. పెన్షన్ అందజేసే క్రమంలో ఎలాంటి అవినీతికి తావులేకుండా సచివాలయ స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రూ.3 వేలకోట్లతో గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు.



- అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**అమరావతి, ఆగస్ట్ 18:** రూ.3 వేల కోట్లతో గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు చేపడతామని సోమవారం అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియచేయడం శుభపరిణామమని, ఈ ఆధునీకరణ పనులు డెల్టా రైతాంగానికి ముఖ్యమంత్రి ఇచ్చిన వరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆనందం వ్యక్తం చేశారు. సర్ అర్థర్ కాటన్ దొర బ్యారేజ్ గేట్ల మరమ్మతులు ప్రారంభించడానికి పిచ్చుక లంక పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు గోదావరి డెల్టా ఆధునికరణ, పిచ్చుకులంక పర్యాటక ప్రాంతం అభివృద్ధి చేయాలని కోరడం జరిగింది. ఇప్పుడు గోదావరి డెల్టా ఆధునికరణ కోసం 3 వేల కోట్ల కేటాయించడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. గోదావరి డెల్టాకు సంబంధించి కాలువలు, డ్రెయిన్లు, లాకులు, షట్టర్లు మొదలైన వాటి నిర్మాణం జరిగి సుమారు 150 ఏళ్లు పూర్తయిందని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం లాకులకున్న గేట్లు, షట్టర్లకు గ్రీజు కూడా పూయని పరిస్థితి, కనీసం మరమ్మత్తులు చేయని దుస్థితి ఏర్పడడంతో అవన్నీ శిధిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఆధునికీకరణ పనులు చేపట్టడం గోదావరి డెల్టా రైతాంగానికి వరంగా మారనుందన్నారు. 2028 డిసెంబర్ నాటికి రూ.35,555 కోట్లతో రాష్ట్రంలో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే మొత్తం రాష్ట్రంలో 19.16 లక్షల ఎకరాలకు నీరు అందుతుందని ప్రకటించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి అపర భగీరధుడిలా మారారని ఆయన అభివర్ణించారు. ఇప్పటికే కాటన్ బ్యారేజీ గేట్ల మరమ్మత్తుల పనులను రూ.150 కోట్లతో చేపట్టడం ద్వారా రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లకు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు గోదావరి డెల్టా రైతాంగం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్‌ను కలిసిన పూసపాటి అశోక్ గజపతిరాజు.

**న్యూ దిల్లీ, ఆగస్ట్ 18:** గోవా రాష్ట్ర గవర్నర్ గా పూసపాటి అశోక్ గజపతి రాజు బాధ్యతలు స్వీకరించి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా, న్యూ దిల్లీ లో భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ న్ని మర్యాద పూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా గోవా రాష్ట్రంలో గవర్నర్ గా గత ఏడాది కాలంగా నిర్వహించిన బాధ్యతలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలకు సంబంధించిన అంశాల పై ఇరువురు చర్చించినట్లు తెలిపారు.
గవర్నర్ గా తన పదవీకాలంలో గోవా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగబద్ధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు అశోక్ గజపతి రాజు తెలిపారు.
ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అశోక్ గజపతి రాజు కి అభినందనలు తెలియజేసి, గోవా గవర్నర్ గా ఆయన మరింత విజయవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. దేశ సేవలో విశేష అనుభవం కలిగిన పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా ఏడాది కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.



# సింహ స్వామి ని దర్శించుకున్న ఎయిర్ మార్షల్ జస్వీర్ సింగ్ మాన్.





**సింహాచలం, పెన్ సత్తా, ఆగస్టు 18:** స్ట్రాటజిక్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఎయిర్ మార్షల్ జస్వీర్ సింగ్ మాన్ మంగళవారం సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ని దర్శించుకున్నారు.
ఆలయానికి విచ్చేసిన ఎయిర్ మార్షల్ జస్వీర్ సింగ్ మాన్‌కు ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి కె. తిరుమలేశ్వర రావు, అర్చక స్వాములు స్వాగతం పలికారు.
అనంతరం ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించారు.
స్వామివారి దర్శనానంతరం ఆలయ వేద పండితులు ఎయిర్ మార్షల్ జస్వీర్ సింగ్ మాన్ కు వేద మంత్రోచ్చారణలతో వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో స్వామివారి ప్రసాదాలు, అందజేశారు.
ఈ సందర్భంగా ఎయిర్ మార్షల్ జస్వీర్ సింగ్ మాన్ స్వామివారి దర్శనం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులు ఆయనకు సింహాచల క్షేత్ర విశిష్టత, స్వామివారి ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి వివరించారు.


# ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని కలిసిన నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి.



**విజయవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 18:** అసెంబ్లీ ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్, గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన దలవాయి రమా దేవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, మంత్రి నారా లోకేష్ కి, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు కి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి దలవాయి రమా దేవి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన పై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతపురం నియోజకవర్గం లోని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దలవాయి రమా దేవి కి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

# కొబ్బరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

- కొబ్బరి ఉపఉత్పత్తులు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలి.
- అసెంబ్లీ వేదికగా కోరిన ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు.




**అమరావతి, ఆగస్ట్ 18:** కోనసీమ కొబ్బరి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఈ ప్రాంతంలో కొబ్బరి ఉప ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు అసెంబ్లీ వేదికగా గళమెత్తారు. అసెంబ్లీ లోని ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో కొబ్బరి తోటల యొక్క ప్రాధాన్యం రాష్ట్రమంతా తెలుసని అయితే, అక్కడే రైతులు సరైన ఆదాయం లేక నష్టపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కొబ్బరి తోటల పునరుద్ధరణకు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సహాయ సహకారాలు అందించాలని వ్యవసాయ శాఖా మంత్రి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడుని ఎమ్మెల్యే బండారు కోరారు. కొబ్బరి ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. కొబ్బరి తోటలు ఉన్న రైతులు నిలదొక్కుకునేలాగా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా కొన్ని పథకాలు తీసుకొచ్చిందని వృద్ధాప్య దశలో ఉన్న కొబ్బరి తోటల్లో కొత్త మొక్కలు నాటడానికి వ్యవసాయ శాఖ సహకారం అందిస్తుందని మంత్రి చెప్పారన్నారు. కొబ్బరి తోటల్లో మరిన్ని రకాల అంతర పంటల సాగుకు సహకారం అందించాలన్నారు. అలాగే కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీకి పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

## జిల్లా పోలీసులకు 25 బాడీ వార్న్ కెమెరాలు అందజేసిన ఈసాయి ఫార్మా.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 18:** శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీసు శాఖకు పరవాడ లోని ఈసాయి ఫార్మాస్యూటికల్స్ సంస్థ 25 బాడీ వార్న్ కెమెరాలను సీఎస్ఆర్ (సీఎస్సార్) నిధుల ద్వారా విరాళంగా అందజేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల పరి రక్షణకు, పోలీసు విధి నిర్వహణకు ఆధునిక సాంకేతికతకు ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సహకారం అందించిన ఈసాయి ఫార్మా ప్రతినిధులు గిరీష్ దీక్షిత్ (సైట్ హెడ్), ఆనంద్ గాల్ఫాడే (అడ్మినిస్ట్రేషన్ హెడ్), మదన్ మోహన్ లకు ఎస్పీ అభినందనలు తెలిపారు.

## లోపిడి గ్రామంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన,



**బుచ్చయ్యపేట, పెన్ సత్తా, ఆగస్టు 18:** లోపిడి గ్రామంలో అప్పలనరసమ్మ ఫిర్యాదు మేరకు, సర్వే నంబర్ 162 కు సంబంధించిన స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాం క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా పరిశీలించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో కలిసి వాస్తవ పరిస్థితులను నమోదు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాస్తవ పరిస్థితుల ఆధారంగా న్యాయం జరిగేలా అవసర మైన చర్యలు తీసుకోవడం పై దళితులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల పరి రక్షణే లక్ష్యంగా, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి అవసర మైన చర్యలు తీసుకోవడంలో ఎస్సీ కమిషన్ నిరంతరం ముందుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో కె.కోటపాడు మండల తహశీల్దార్, పోలీస్ యంత్రాంగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరులో జూనియర్ భారీ నిరసన ర్యాలీ.

స్టైఫండ్ పెంచాలని కలెక్టరేట్ ముట్టడి.



**గుంటూరు, పెన్ సత్తా, ఆగస్టు 18:** తమ న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జిజిహెచ్) జూనియర్ డాక్టర్లు మంగళవారం నాడు భారీ ఎత్తున రోడ్డెక్కారు. రమేష్ హాస్పిటల్ సిగ్నల్ జంక్షన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు జుడాలు భారీ ప్రదర్శన నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, "వీ వాంట్ జస్టిస్" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో పని ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్నా దానికి తగ్గట్టుగా జీతాలు (స్టైఫండ్) పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులకు 24 గంటలూ సేవలు అందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా వీరు ప్రధాన డిమాండ్లు వెల్లడించారు. 1, స్టైఫండ్ పెంపు: పెరిగిన ధరలకు అనుగుణంగా జూనియర్ డాక్టర్ల స్టైఫండ్‌ను తక్షణమే పెంచాలి. 2, పనిభారం తగ్గింపు: ఆసుపత్రుల్లో విపరీతంగా ఉన్న పని ఒత్తిడిని తగ్గించేలా చర్యలు చేపట్టాలి. సమస్యల పరిష్కారం: జూనియర్ డాక్టర్ల విధులకు సంబంధించిన ఇతర 3 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలి. సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని, ప్రభుత్వం ఇప్పటి కైనా స్పందించి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

# జీవీఎంసీ 6,7,8 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం.

### జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 18:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మధురవాడ జోన్ పరిధిలోని 6,7,8 వార్డులలో పలు ప్రాంతాలకు ఆగస్టు 20, 2026 (గురువారం) తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా మెయింటెనెన్స్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
జీవీఎంసీ మధురవాడ జోన్లో త్రాగు నీటిని సరఫరా చేసే గోస్తని నది జలాలను పంపింగు చేయు 700 యం.యం. వ్యాసార్థము కలిగిన ప్రధాన పైపులైన్ మధురవాడ పాత పెప్సీ కంపెనీ వద్ద మరమ్మత్తులకు గురైనందున దానిని మరమ్మతులు చేయుటకు గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద 370 హెచ్పి మోటార్ ద్వారా త్రాగు నీటిని పంపు చేయడం ఆపివేయడం జరిగిందని, కావున వార్డు నెం.6 పరిధిలో రిక్షా కాలనీ, వైభవ్ నగర్, రేవళ్ళపాలెం, బక్కన్న పాలెం, పీఎం పాలెం, లక్ష్మీ వానిపాలెం, అశోక్ నగర్, పీఎం పాలెం- ఎల్ఐసీ స్, ఏంఐజిస్, ఆర్.హెచ్. కాలనీ, కే 1, కే 2, కే 3, ఎం 1 హౌసింగ్ కాలనీ, అమరావతి కాలనీ, వార్డు నెంబర్.7 పరిధిలో ఎన్జిఓస్ కాలనీ, మిధిలాపురి వుడా కాలనీ పార్ట్ మరియు వార్డు నెంబర్. 8 పరిధిలో షిప్ యార్డ్ లేఅవుట్ తదితర ప్రాంతాలలో త్రాగునీటికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. తాగునీటి సరఫరాలో కలిగే అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ తరపున ఆయన కోరారు. అత్యవసర ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేపట్టడం జరుగుతుందని, నీటి ట్యాంకర్ ద్వారా నీరు కావలసిన పురప్రజలు మధురవాడ జోన్ నీటి సరఫరా సహాయక ఇంజనీర్లులను సంప్రదించగలరని, వార్డ్ నెంబర్ 6 ఇంచార్జ్ సహాయకి ఇంజనీరు 8297652049, వార్డ్ నెంబర్ 7 ఇంచార్జ్ సహాయకి ఇంజనీరు 9603152887, వార్డ్ నెంబర్ 8 ఇంచార్జ్ సహాయకి ఇంజనీరు 9908477519 లను సంప్రదించాలని మంచినీటి విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు.

# పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ: కలెక్టర్ కృతికా శుక్లా హాజరు.



**చిలకలూరిపేట, పెన్ సత్తా, ఆగస్ట్ 18:** రూరల్ పరిధి లోని యడవల్లి గ్రామంలో ఉన్న ఎం ఎస్ వీరశివ గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వీరశివ-2 క్వారీలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ క్వారీలో బ్లాక్ గ్రానైట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 600 క్యూబిక్ మీటర్ల నుంచి దాదాపు 3 ఎకరాల విస్తీర్ణంలో 10,006 క్యూబిక్ మీటర్లకు పెంచేందుకు గాను యాజమాన్యం అనుమతులు కోరగా, ఈ సేకరణ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యడవల్లి, గురిజేపల్లి గ్రామాల నుంచి సుమారు 50 మంది స్థానికులు, రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల నుంచి స్వీకరించిన అభిప్రాయాలు, వినతులను నివేదిక రూపంలో పర్యావరణ శాఖ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎస్.ఐ.ఆర్.లో నోటీసుల జారీ, హియరింగ్ పై ప్రత్యేక దృష్టి.

- నిర్ణీత గడువు లోగా 100 శాతం నోటీసుల జారీ పూర్తి చేయాలి.
- ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్టు 18:** ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో జారీ చేసిన నోటీసుల పై సంబంధిత ఈఆర్వోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లా లోని ఈఆర్వోలు, అదనపు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతి పై సమీక్షించారు. డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్. ప్రచురిత మైన రోజు నుంచి ఇప్పటి వరకు జారీ చేసిన నోటీసులు, వాటి డెలివరీ, హియరింగ్, తదినంతరం వివరాల అప్ డేట్ పై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. ఒక్కో ఈఆర్వో తమ నియోజకవర్గ పరిధిలో జారీ చేసిన నోటీసులకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. భీమిలి నియోజకవర్గంలో నోటీసుల జారీ పురోగతి పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నోటీసుల జారీలో ఎటువంటి జాప్యాన్ని సహించబోమని, ఒక్క రోజులో 100 శాతం నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో నోటీసుల డెలివరీని వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా వెంటనే సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేయాలని సూచించారు. ఓటర్ల నుంచి నోటీసులు తిరిగి స్వీకరించిన వెంటనే సంబంధిత వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో పూర్తయిన హియరింగుల వివరాలను తప్పనిసరిగా బీఎల్వో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. గాజువాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నోటీసులను తక్షణమే జారీ చేయాలని స్పష్టం చేశారు. నోటీసుల డెలివరీ, హియరింగ్, వివరాల అప్‌డేషన్ వంటి ప్రక్రియల్లో జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, అదనపు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

# కూటమి కి చిత్తశుద్ధి ఉంటే విశాఖలో జరుగుతున్న భూ అక్రమాల పై చర్యలు తీసుకోవాలి.


### బర్మా కాలనీలో భూ అక్రమాల పై కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు కె. కె.రాజు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, ఆగస్ట్ 18:** 49 వ వార్డు బర్మాకాలనీ లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన గృహాలను తొలగించాలని కోరుతూ నిరుపేద కాందీశీకుల పోరాట ఐక్య వేదిక చేపట్టిన అమరణ నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన వైసిపి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత 49 వ వార్డులో బర్మా కాలనీ లోని ప్రభుత్వ భూమిని ఇక్కడ ఉన్న బీజేపీ నాయకులు అక్రమంగా ఆక్రమిస్తున్నారని కాంధీశీకుల పోరాట ఐక్యవేదిక సభ్యులుతో కలిసి స్వయంగా జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తే కనీసం ఈ రోజు వరకు పట్టించు కోకుండా ఇప్పటికీ కూడా అధికార పార్టీకి వత్తాసు పలకడం చాలా దారుణమని అన్నారు. కాళీ స్థలంలో చిన్న గుడిసి కట్టుకుంటేనే జీవీఎంసీ సిబ్బంది గానీ, రెవెన్యూ యంత్రాంగం మొత్తం అక్కడ వాలిపోయి హడావుడి చేసి కూల్చేస్తారు చేస్తారన్నారు. అలాంటది నగరం నడిబొడ్డున ఇంత స్థలాన్ని ఆక్రమిస్తూ ఉంటే ప్రభుత్వ యంత్రాంగం పట్టించు కోలేదు అంటే ఇక్కడ ఎంత అవినీతిమయం జరుగుతుందో ప్రజలు అందరూ గమనించాలని అన్నారు. మా మీద, మా పార్టీ నాయకులు మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఈ కూటమి నాయకులకి ఒకటే సవాలు చేస్తున్నా మేము గాని, మా పార్టీ కార్యకర్తలు గాని ఒక గజం స్థలం ఆక్రమించాని నిరూపిస్తే మీకు నచ్చిన కేసులు పెట్టుకోవచ్చని ఛాలెంజ్ చేస్తున్నానని అన్నారు. మీరు చేస్తున్న తప్పులను మేము ఎత్తిచూపితే ప్రజల పక్షాన మేము పోరాటం చేస్తే మమ్మలిని అరాచక శక్తులని రౌడీలని చిత్రీకరిస్తున్నారని మీరు ఎన్ని నిందలు వేసిన ప్రజల పక్షాన మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు.
ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన గృహాలను తొలగించాలని కోరుతూ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న వారికి ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే సమాధానం చెప్పవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, ఎస్ఈసి సభ్యులు కట్టమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు అల్లు శంకర్ రావు, సాడి పద్మా రెడ్డి, బర్కత్ ఆలీ, వార్డుప్రెసిడెంట్స్ ఐ రవి కుమార్, బొడేటి కిరణ్, బీశెట్టి ప్రసాద్, జక్కంపూడి సత్యనారాయణ, డోప్ప శ్రీను,లాలం వేణు, ఎర్రం శెట్టి శ్రీను,సీనియర్ నాయకులు అంబటి శైలేష్, బోగవల్లి గోవింద్, పైడి శ్రీను, తుల్లీ చంద్రశేఖర్, కరి రామారెడ్డి, సబ్బవరపు శ్రీను, మువ్వల సంతోష్, శ్రవణ్, జాయ్, సారిపల్లి సంతోష్, భద్రి, శివరాం, సురేష్, ఢిల్లీ రావు, విమల్, అశోక్, గుదే రాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ లో థర్డ్ ఫ్రెంట్: వ్యూహాలకు పదును.. !

వచ్చే ఎన్నికల నాటి కి రాష్ట్రంలో రాజకీయ వ్యూహాలు మారుతున్నాయా? ముఖ్యంగా చిన్న చితకా పార్టీలు చేతులు కలపనున్నాయా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. దీనికి సంబంధించి గ్రౌండ్ వర్క్ కూడా జోరుగా సాగు తున్నట్టు చెబుతున్నారు. ప్రస్తుతం మూడు పార్టీలైన టీడీపీ-బీజేపీ-జనసేన కూటమిగా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో నూ ఈ మూడు పార్టీలు బలమైన పోటీ ఇవ్వనున్నాయి. ఇక, వైసీపీ ఒంటరి పోరువైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. నిజానికి గత కొన్నాళ్లుగా వైసీపీతో చెలిమికి కొన్ని పార్టీలు మొగ్గు చూపాయి.ముఖ్యంగా కమ్యూనిస్టులు, జై భారత్ భీం పార్టీ వంటివి వైసీపీతో కలిసి ముందుకు సాగాలని అనుకున్నాయి. కానీ, ఆ అవకాశం వైసీపీ ఇవ్వట్లేదని తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఉన్నా.. ఆ పార్టీతో జట్టు కట్టాలని అనుకున్నా.. అసలు ఎక్కడా పార్టీ పరిస్తితి పడ్డ చోట నుంచి లేచే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ పార్టీ వైపు ఎవరూ తొంగి చూడడం లేదు. దీంతో తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటుపై పార్టీలు దృష్టి పెట్టాయి. దీనిలో భాగంగా ఇటీవల తిరుపతి, విజయవాడల్లో సమావేశాలు జరగడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. కమ్యూనిస్టులు కలివిడిగా ముందుకు సాగడంతోపాటు.. మాజీ ఐపీఎస్ వెంక టేశ్వరరావు



పెట్టబోయే(?) పార్టీ సహా.. ఆమ్ ఆద్మీ, బీఎస్పీ, మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ, జైభారత్ భీం సహా.. మరికొన్ని పార్టీలు చేతులు కలిపేందుకు రెడీ అయ్యాయి. ఇదే విషయాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు వెల్లడించడం గమనార్హం. అలానే మాజీ ఐపీఎస్ వెంకటేశ్వరరావు కూడా చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి తృతీయ ఫ్రంట్ ఏర్పాటుపై త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు.

**ఎవరికి ఇబ్బంది.. ?**

తృతీయ ఫ్రంట్ కనుక రంగంలోకి దిగితే.. ప్రధానంగా వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. సహజంగానే ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలిపోయి.. ఈ తృతీయ పక్షం పార్టీలకు పడే అవకాశం ఉందని.. తెలుస్తోంది. నియోజకవర్గానికి 5 నుంచి 10 వేల ఓట్ల మధ్యలో చీలిపోయినా.. అది కూటమి పార్టీలకు మేలు చేస్తుందని అంటున్నారు. ఇదే సమయంలో వైసీపీకి పెద్ద ప్రమాదం తప్పదన్న లెక్కలు వస్తున్నాయి. ఇక, కూటమి విషయాని కి వస్తే.. వ్యతిరేక ఓటు బ్యాంకు చీలిపోతే..మరోసారి కూటమి అధికారంలోకి రావడం తథ్యం. ఇక, అధికారమే పరమావధిగా తృతీయ కూటమి ఏర్పడుతున్నా.. అది సాధ్యం కాకపోవచ్చు.

# మాజీ మంత్రి కుమారుడికి పెళ్లి ఇష్టం లేదా..
# సోషల్ మీడియాలో వైరల్!

వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై సొంత కోడలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కుటుంబ వ్యవహారం కాస్త రచ్చకు దారితీసింది. ఆ కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు కేసు నమోదు కూడా చేశారు. ఒకవైపు ఈ కేసు విచారణ కొనసాగుతుండగా.. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబ సభ్యుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడికి ఇష్టం లేని పెళ్లి చేశారని వెలుగు చూస్తోంది ఆ వీడియోలో. ఏకంగా జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదన్నట్టు చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనవసరంగా తనను ఒత్తిడి చేసి పెళ్లి చేయించారని ఆయన మాట్లాడుతున్న అంశాలకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది.మొన్న మధ్యన మాజీమంత్రి జోగి రమేష్ కుటుంబం పై ఆయన కోడలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తన అత్తవారు ఇంట తనకు మానసికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. తీవ్రంగా హింసిస్తున్నారని.. గృహ హింసకు పాల్పడ్డారని.. ఒకటి రెండుసార్లు హత్య ప్రయత్నం చేశారని ఆమె ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే జోగి రమేష్ మాజీ మంత్రి కావడం.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కావడం తీవ్ర చర్చకు దారితీసింది. పైగా ఆమె తెలంగాణకు చెందిన యువతి కావడంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది ఈ ఘటన. అయితే దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్ కుటుంబ సభ్యులు. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న వ్యవహారాలతోనే బాధితురాలు బయటకు వచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. కేవలం జోగి రమేష్ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు సమీప బంధువులు 11 మంది తనపై వేధింపులకు గురి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి నిందితుల్లో ఒకడైన జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. కుటుంబ సభ్యుల బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పించారని చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైన తర్వాత జోగి రమేష్ కోడలి కుటుంబ సభ్యులకు జరిగిన చర్చలు బయటకు వచ్చాయి. అసలు తనకు ఈ వివాహం ఇష్టం లేదని.. అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జాము వరకు తనకు వైట్ వాష్ చేశారని.. బలవంతంగా ఒప్పించారంటూ జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తండ్రి పై తిరగబడుతున్న వీడియోలకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు బయటకు వచ్చాయి.. అయితే ఆ కుటుంబంలో అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే సొంత కుటుంబ సభ్యులే ఈ వీడియో లిఫ్ట్ చేశారని అర్థం అవుతోంది. కాగా ఈ సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

# 'పవన్ ను ముఖ్యమంత్రి చేసేందుకే జనసేన'
# - ఎమ్మెల్యే నానాజీ సంచలన వ్యాఖ్యలు

టీడీపీ-జనసేన పొత్తు విషయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కోసమే జనసేన పనిచేస్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించిన ఆయన కొత్త వివాదానికి తెర తీశారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 'టీడీపీకి కాపు కాయడానికి జనసేన లేదు. పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి చేయడానికే పార్టీ పెట్టాం' అంటూ ఎమ్మెల్యే నానాజి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాకినాడ రూరల్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ఇరుపార్టీల మధ్య వేడి రాజేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల ముందు కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఉన్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఏపీలో టీడీపీ-జనసేన పొత్తు బలమైన బంధంగా మారడంతో 2024 ఎన్నికల్లో తిరుగులేని విజయం అందుకున్న విషయం తెలిసిందే. రెండేళ్లుగా పొత్తు ధర్మం పాటిస్తూ ఇరుపార్టీల అధినేతలు ఎంతో జాగ్రత్తగా నడుచుకుంటున్నా, క్షేత్రస్థాయిలో వాతావరణం అలా లేదని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు బట్టి అర్థం అవుతోందని పరిశీలకులు అనుమానిస్తున్నారు. పొత్తుల వల్ల తమకు సరైన గుర్తింపు రావడం లేదని జనసేన కార్యకర్తలు భావిస్తున్నారా? అన్న సందేహాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కోసమే జనసేన పనిచేస్తున్నట్లు ఉందన్న రాజకీయ ప్రత్యర్థుల విమర్శలకు జనసేన శ్రేణులను ప్రభావితం అవుతున్నట్లు కనిపిస్తోందన్న అభిప్రాయమూ వ్యక్తం చేస్తున్నారు. కూటమిగా మరో 15 ఏళ్లు కలిసి



పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నారు. అదే సమయంలో ఇరుపార్టీల ద్వితీయశ్రేణి నాయకులు కలిసిమెలిసి ఉండాలని, రాజకీయ ప్రత్యర్థుల పన్నాగాలను పసిగట్టి విభేదాలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో నేతలు అధినేతల సూచనలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వనట్లు కనిపిస్తోందని ఇలాంటి ఘటనలు రుజువు చేస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం అవసరమని, ఆయన విజన్ కోసం కలిసి పనిచేద్దామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా చెబుతున్నప్పటికీ, ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఆ స్థాయి నాయకులు మాత్రం పవన్ ను ముఖ్యమంత్రి చేస్తామంటూ చేస్తున్న ప్రకటనలు వివాదానికి కారణమవుతున్నాయని అంటున్నారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే టీడీపీకి కాపు కాయడానికి జనసేన లేదంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం సృష్టిస్తున్నాయని చెబుతున్నారు. ఆయన ఏ ఉద్దేశంతో ఇలా మాట్లాడారో తెలియదు కానీ, టీడీపీ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టేలా ఉన్నాయని మాత్రం చెబుతున్నారు. ఇక ఈ అంశంపై జనసేన అధిష్టానం ఎలా స్పందిస్తుందనేది చూడాల్సివుందని అంటున్నారు.

### తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఏసీబీ సోదాలు..
## రూ.2.48 లక్షల నగదు స్వాధీనం

తిరుపతిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు సిబ్బందితో కార్యాలయానికి చేరుకుని సోదాలు చేపట్టారు. దీంతో సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లలో కలకలం రేగింది. కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు లెక్కల్లో చూపని రూ. 2.48 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదు వివరాలకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీదేవిని విచారించారు. నగదుతోపాటు కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ రికార్డులను, సంబంధిత దస్తావేజులను, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఏసీబీ తనిఖీలు కొనసాగుతుండడంతో కార్యాలయానికి వచ్చిన డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనకు గురయ్యారు. దీంతో వీరిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. డీఎస్పీ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ అవినీతి ఫిర్యాదులు రావడంతో తనిఖీలు జరిపామన్నారు. అన్ అకౌంటెడ్‌గా ఉన్న రూ2.48లక్షలను స్వాధీనం చేసుకున్నామని, సోమవారం జరిగిన 42 రిజిస్ట్రేషన్లను కూడా పరిశీలిస్తున్నామన్నారు

## చంద్రుడిపై శాశ్వత అడుగులు

చంద్రుడిపై మనిషి ఎక్కువకాలం నివసించగలడా? అక్కడే ఉండి పరిశోధనలు చేయడం, అవసరమైన వనరులను వినియోగించుకోవడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ అమెరికా అంతరిక్ష సంస్థ కీలక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దశలవారీగా ఏర్పాటు చేసి, భవిష్యత్‌లో అక్కడ దీర్ఘకాలిక మానవ ఉనికికి పునాది వేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. నాసా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2029-32 మధ్య ప్రారంభ నివాస సదుపాయాలను ఏర్పాటు చేసి, 2032 తర్వాత చంద్రుడిపై నిరంతర మానవ కార్యకలాపాలను విస్తరించనుంది చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రేడియేషన్, చంద్ర రాత్రుల్లో విద్యుత్ కొరత, భూమి నుంచి దూరం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే రోవర్లు, ల్యాండర్లు, డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస మాడ్యూళ్లను దశలవారీగా చంద్రుడిపైకి పంపి వాటి పనితీరును పరీక్షించాలని నాసా భావిస్తోంది.మూన్ బేస్‌కు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు. శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో నీటి మంచు ఉండే అవకాశం ఉంది. నీటిని భవిష్యత్‌లో తాగునీరు, ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి వనరుల కోసం ఉపయోగించగలిగితే చంద్రుడిపై దీర్ఘకాలిక మానవ నివాసానికి అది కీలకంగా మారుతుంది.ఇక్కడే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. చంద్రయాన్-2లోని పరికరం చంద్రుడి ధ్రువ ప్రాంతాలను రాడార్ ద్వారా అధ్యయనం చేసింది. 2026లో ఇస్రో వెల్లడించిన తాజా పరిశోధన ప్రకారం.. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని కొన్ని శాశ్వత నీడ ప్రాంతాల్లోని నాలుగు క్రేటర్ల అడుగుభాగాల్లో ఉపరితలానికి దిగువన నీటి మంచు ఉండే అవకాశాన్ని రాడార్ పరిశీలనలు సూచించాయి. చంద్రయాన్-2 డేటా ఆధారంగా ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి ధ్రువ ప్రాంతాల్లో నీటి మంచు, ఉపరితల స్వభావం, ఇతర భౌతిక లక్షణాలకు సంబంధించిన కీలక డేటాను రూపొందించారు. భవిష్యత్ చంద్ర మిషన్ల ల్యాండింగ్ ప్రాంతాల ఎంపికకు ఈ సమాచారం ఉపయోగపడే అవకాశం ఉంది.నాసా ప్రణాళిక ప్రకారం తొలి దశలో రోవర్లు, ల్యాండర్లు, ఇతర రోబోటిక్ వ్యవస్థలు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశీలిస్తాయి. అనంతరం 2029 నుంచి సెమీ-పర్మినెంట్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస సదుపాయాల ఏర్పాటు ప్రారంభమవుతుంది. ఈ దశలో భారీ మొత్తంలో కార్గోను చంద్రుడిపైకి పంపేందుకు అనేక ల్యాండర్ మిషన్లను ఉపయోగించనున్నారు2032 తర్వాతి దశలో మాత్రం లక్ష్యం మరింత పెద్దది. వ్యోమగాములు చంద్రుడిపై ఎక్కువకాలం నివసించి పనిచేసేలా సెమీ-పర్మినెంట్ హ్యాబిటేషన్ మాడ్యూళ్లు, దీర్ఘకాలిక విద్యుత్ వ్యవస్థలు, ప్రెషరైజ్డ్ రోవర్లు, నిరంతర సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నాసా భావిస్తోంది. ఈ మూన్ బేస్ భవిష్యత్‌లో అంగారకుడి వంటి సుదూర గ్రహాల మిషన్లకు శిక్షణ, పరిశోధన, సాంకేతిక పరీక్షల కేంద్రంగా ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ప్రస్తుతం నాసా అధికారిక ప్రణాళికలో 2027లో ఆర్టెమిస్-3 ద్వారా నేరుగా చంద్రుడిపై మానవులు దిగడం కాకుండా, ఆ మిషన్‌ను భూమి కక్ష్యలో కీలక వ్యవస్థల పరీక్షలకు ఉపయోగించనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి తొలి ప్రణాళికాబద్ధమైన మానవ ల్యాండింగ్ ఆర్టెమిస్-4తో 2028లో జరగనుంది.చంద్రుడిపై మానవాళి దీర్ఘకాలిక ఉనికికి అడుగులు పడుతున్న వేళ.. ఇస్రో అందిస్తున్న చంద్ర ధ్రువ ప్రాంత డేటా, నీటి మంచిపై పరిశోధనలు, భవిష్యత్ చంద్ర మిషన్లకు భారత్ కీలక భాగస్వామిగా నిలిచే అవకాశాన్ని పెంచుతున్నాయి. చంద్రుడిపై మొదలయ్యే ఈ కొత్త అధ్యాయం.. చివరికి అంగారకుడిపై మనిషి అడుగుపెట్టే ప్రయాణానికి మరో పెద్ద మెట్టుగా మారనుంది.

## లోకల్ బాడీ ఎన్నికల ఫీవర్

ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను ఏ విధానంలో నిర్వహించాలనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈవీఎంల కంటే బ్యాలెట్ పేపర్ విధానానికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.స్థానిక ఎన్నికలకు అవసరమైన స్థాయిలో ఈవీఎంలు అందుబాటులో లేకపోవడం బ్యాలెట్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బ్యాలెట్ విధానంలో ఓటరు అభ్యర్థుల గుర్తులు, పేర్లను చూసి తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాల్సి ఉంటుంది. అందువల్ల అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, గ్రామంలో చేసిన పని, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఓటింగ్ విధానం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల బలం, పార్టీ సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. బ్యాలెట్ విధానం తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే గ్రామస్థాయిలో ఓటర్లు తమ ప్రాంతానికి ఎవరు మెరుగైన సేవలు అందించగలరనే విషయాన్ని ప్రధానంగా పరిశీలించే అవకాశం ఉంది.కూటమి విషయానికి వస్తే సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతోందనే ప్రచారం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కూటమి సమన్వయం కూడా ఎన్నికల సమయంలో కీలకంగా మారవచ్చు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీరు, విద్య, ఉపాధి వంటి స్థానిక అవసరాలపై ప్రజల దృష్టి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పనులు తమ ప్రాంతానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో ఓటర్లు అంచనా వేసే అవకాశం ఉంది. అదే సమయంలో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల బ్యాలెట్ విధానం అమలైతే ఒక పార్టీకి స్వయంచాలకంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పడం కష్టం. ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది చివరకు ప్రజల తీర్పే. గ్రామస్థాయిలో తమకు దగ్గరగా ఉన్న సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే అంశమే ఓటర్ల నిర్ణయంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది అన్న విషయం పై సర్వత్ర ఉత్కంఠత నెలకొంది..

# భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

భారతదేశంలో దాదాపు 100 కోట్ల మంది అర్హులైన ఓటర్లకు ప్రత్యేక ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డులు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ ఓటింగ్ సంస్కరణల కోసం భారతదేశ ఓటర్ ఐడీల విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఈ కీలక వివరాల్ని వెల్లడించింది. భారతదేశంలో ప్రతి ఓటరూ కచ్చితంగా ఫొటో గుర్తింపు కార్డు ఆధారంగానే ఓటు వేస్తారని అధికారులు నొక్కి చెప్పారు. ఓటర్లు తమ వ-జ్యూ×జ ను కూడా ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అమెరికాలో ఓటర్ల అక్రమాలను అరికట్టేందుకు, పౌరసత్వ ధ్రువీకరణను తప్పనిసరి చేసే సేవ్ (సేఫ్‌గార్డ్ అమెరికన్ ఓటర్ ఎలిజిబులిటీ – ాూాఎజు) అమెరికా యాక్ట్‌కు మద్దతుగా ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఇటీవల జరిగిన భారత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల గుర్తింపు విధానం ఎంతో పటిష్టంగా ఉందని ట్రంప్ కొనియాడారు. ఈ క్రమంలోనే అమెరికా ఎన్నికల్లో కూడా ఓటర్లకు ఫొటో ఐడీ కార్డులను తప్పనిసరి చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**ట్రంప్ ఏం పోస్ట్ చేశారంటే?**

కొద్ది రోజుల కిందట భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్? కుమార్ అమెరికా ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నించారు. భారత్‌లో మాదిరిగా ఓటు వేసేందుకు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు (వాలిడ్ ఫొటో ఐడీ) లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహించగలుగుతున్నారని అడిగారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. 'ఈ నెల ప్రారంభంలో భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్? కుమార్ మన అధికార యంత్రాంగాన్ని ఒక ప్రశ్న అడిగారు. చెల్లుబాటు అయ్యే ఫొటో ఐడీ లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. భారత్‌లో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొనగా, వారిలో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించిన వారు ఒక శాతం కంటే తక్కువే. ప్రతి ఒక్క ఓటరు దగ్గర కచ్చితంగా ప్రభుత్వ ఫొటో ఐడీ కార్డు ఉంది' అని ట్రంప్ ప్రశంసించారు.




**అత్యంత పారదర్శకంగా భారత ఎన్నికల వ్యవస్థ: ఈసీ**

ఈ సందర్భంగానే భారత ఎన్నికల కమిషన్ అధికారులు తమ నిష్పాక్షికమైన ఎన్నికల నిర్వహణ తీరును వివరించారు. ఈసీ ప్రకారం– దేశవ్యాప్తంగా ఉన్న 12 లక్షల పోలింగ్ స్టేషన్లకు గానూ ప్రభుత్వ ఉద్యోగులైన బూత్ లెవెల్ అధికారులు (దీూా) ఓటర్ల జాబితాల్ని సిద్ధం చేస్తారు. వీటిని రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాా) నిరంతరం ఆడిట్ చేస్తారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు ఓటింగ్ కేంద్రాల్లో ఉండి ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అలానే ఓట్ల లెక్కింపు సమయంలో కూడా కౌంటింగ్ ఏజెంట్లు ప్రత్యక్షంగా హాజరై ఓటింగ్, కౌంటింగ్ పారదర్శకతను నిర్ధరిస్తారు. ఫిజికల్ కార్డుల్ని ఓటర్లకు అందించడంతో పాటు డిజిటల్ రూపంలో కూడా తమ ఓటరు ఐడీని ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కూడా ఉంది.

అమెరికాలో సేవ్ అమెరికా యాక్ట్‌కు మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగానే ట్రంప్ తాజాగా భారత ఎన్నికల వ్యవస్థను ప్రస్తావిస్తూ ఈ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చట్టం ద్వారా ఓటరు నమోదు సమయంలో సదరు పౌరులు పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలు సమర్పించడం, దేశవ్యాప్తంగా ఓటర్ ఐడీ అవసరాన్ని తీసుకురావడం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై పరిమితులు విధించడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో భాగంగానే తన వాదనలకు బలం చేకూర్చేందుకు, భారత్‌ను ఉదాహరణగా చూయిస్తూ సేవ్ అమెరికా యాక్ట్‌ను ఆమోదించుకోవాలని ట్రంప్ చూస్తున్నారు. ఈ క్రమంలోనే యూఎస్ ఎన్నికల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలని ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అసలైన అమెరికన్ పౌరులే ఎన్నికల్లో ఓటేసేలా చూడటమే దీని ఉద్దేశమని చెబుతున్నారు.

# 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు, ఉగ్రదాడుల వెనుక ఉన్న నిందితుల్ని చట్టం ముందు నిలబెట్టేందుకు భారతదేశం 'ఎంతటి చర్యలకైనా వెనుకాడదు' కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. 2008 నాటి 26/11 ముంబయి ఉగ్రదాడి కేసులో పాకిస్థాన్‌లో దాక్కున్న ఆరుగురు ప్రధాన నిందితులపై ముంబై పోలీసులు 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా' ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలోనే ఎంఈఏ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానాన్నే ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా అంటారు. దీనిపైనే మాట్లాడిన భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్– సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కునే విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోమని, ఎలాంటి చర్యలైనా తీసుకుంటామని జైస్వాల్ స్పష్టం చేశారు. ఉగ్రవాదం వల్ల భారత్ తీవ్రంగా నష్టపోయిందని, ఉగ్రవాద చర్యలు ఎంత తీవ్రమైనవో అంతర్జాతీయ సమాజం గుర్తించాలనే తాము కోరుతున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు బయట జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల్ని ఏకం చేసేందుకు భారత్ నిరంతరం శ్రమిస్తోందని, ఈ పోరాటంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోదని జైస్వాల్ వెల్లడించారు.

**హఫీజ్ సయీద్ సహా నిందితులు వీరే**

26/11 కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ముంబయి పోలీసులు ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు (గైర్హాజరీలో విచారణ) సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. వీరిలో లష్కరే తోయిబా (ాజు) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్, సీనియర్ ఆపరేటివ్ జకీ–




ఉర్– రెహ్మాన్ లఖ్వీ, సాజిద్ మీర్, అబు అల్కామా, అసిమ్ అలియాస్ అబు కహాఫా, మేజర్ అబ్దుర్ రెహ్మాన్ పాషా ఉన్నారు. ఈ నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న నేపథ్యంలో ముంబయి పోలీసులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నిగమ్‌కు లేఖ రాసి తదుపరి ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇలాంటి ఉగ్రవాద కేసులో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీచీూ), 2003లోని సెక్షన్ 356 కింద ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు సంబంధించిన నిబంధనల్ని తొలిసారి వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉజ్వల్ నిగమ్ ప్రకారం– పరారీలోని నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా వారిపై విచారణ కొనసాగించేందుకు సెక్షన్ 356 అవకాశం కల్పిస్తుంది. న్యాయ ప్రక్రియలో అనవసర జాప్యాన్ని నివారించడమే దీని ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇక 2008 నవంబర్ 26న పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయి నగరంపై భీకర దాడులు చేశారు. ఈ ఘటనలో 160 మందికిపైగా పౌరులు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ దాడులకు ప్రణాళిక రూపొందించడం, సహకరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో దాక్కున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని భారత్ పదేపదే కోరుతూ వచ్చింది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు 14 రాష్ట్రాల్లో భారత భద్రతా దళాలు నిర్వహించిన విస్తృత ఆపరేషన్లలో పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షాజాద్ భట్టి ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేశాయి. ఈ దాడుల్లో 253 మందిని అదుపులోకి తీసుకోగా, 80కిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 200 కుపైగా ఆపరేటర్లను అరెస్ట్ చేసినట్లు భద్రతా సంస్థలు వెల్లడించాయి. ఇక ఈ కుట్రలతో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనల్ని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. షాజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు ఐఎస్ఐతో సంబంధం ఉందని భారత్ వాదిస్తుండగా పాకిస్థాన్ దీనిని తిరస్కరించింది. దీనిపై మాట్లాడిన జైస్వాల్, భారత ప్రభుత్వం ఇప్పటికే దీనిపై తమ వైఖరిని వెల్లడించిందని, దానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు.

**జమ్మూలో ాజు కమాండర్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్**

ఇక పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఆపరేషనల్ కమాండర్ మహ్మద్ యాకూబ్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న నిందితుడిపై ఈ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఈ యాకూబ్‌ను అబు సుమామా, సుమామా ఇల్యాస్, వారిస్ అలీ అనే పేర్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. యాకూబ్ ఇస్లామాబాద్‌లోని చట్టా బఖ్తావర్ ప్రాంతం నుంచి లష్కరే తోయిబా కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన కేసులో విషయంలో దిల్లీ ప్రభుత్వం జాప్యం చేయొద్దని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు కొట్టివేయాల్సిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం వెంటనే సమర్పించాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

కోర్టు ఎఫ్ఐఆర్‌ల వివరాలను కోరుతున్నప్పుడు ప్రభుత్వం వాటిని సమర్పించడంలో ఎందుకు వెనుకాడుతోందని దాస్ ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని మరింత ఆలస్యం చేసే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమేనని అన్నారు. ప్రభుత్వం ఇతర నేర కేసులపై చర్యలు తీసుకోవాలనుకుంటే అది వేరే అంశమని పేర్కొన్నారు. సుమారు 2,800 మంది తీవ్ర నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించినట్లు ప్రభుత్వం చెబుతోందని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవడాన్ని విద్యార్థుల కేసులతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులోనూ చట్టపరమైన సమస్యలు ఎదుర్కోకుండా చూడాలని సీజేపీ కోరుతోంది. కేసులను కేవలం క్లోజ్ చేసినట్లు చూపడం కాకుండా, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను అధికారికంగా ఉపసంహరించుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తోంది.

**దర్యాప్తు జరిపేందుకు హైపవర్డ్ కమిటీ**

మరోవైపు నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలపైన పిటిషన్?పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. నిరసనల సందర్భంగా వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది. నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలైన పిటిష పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.




**ఆరోపణలను ఖండించిన దిల్లీ పోలీసులు**

అయితే తమపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టులో దిల్లీ పోలీసులు ఖండించారు. జులై 20న సీజేపీ నిర్వహించిన మార్చ్‌లో నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టి, పార్లమెంటు వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడం వల్లే హింస చెలరేగిందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ ఈ వివరాలు వెల్లడించారు. సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో 30,000 మందికి పైగా నిరసనకారులు గుమికూడగా వారిని నియంత్రించేందుకు 5,000 మంది పోలీసులను మోహరించినట్లు డీసీపీ తెలిపారు. పరిస్థితి అదుపు తప్పడంతోనే పోలీసుల జోక్యం అనివార్యమైందని ఈ ఘర్షణల్లో ఇరువైపులా గాయాలయ్యాయని పేర్కొన్నారు. పోలీసుల చర్యలు చట్టబద్ధంగానే ఉన్నాయని ఎలాంటి అక్రమ లేదా అనవసర బలప్రయోగం జరగలేదని అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలో భాగంగా జులై 20న సీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఇతర ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు కొందరు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. పోలీసుల చర్యలకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిరసనకారులపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని కొన్ని వర్గాలు ఆరోపించాయి. అయితే పోలీసు శాఖ తన చర్యలను సమర్థించుకుంది.

## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

ఝార్ఖండ్ ప్రభుత్వం, విద్యార్థుల మధ్య చర్చలు సఫలం కావడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చర్చల మార్గాన్ని ఎంచుకోవడం, విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకోవడం సరైన విధానమని ప్రశంసించారు. విద్యార్థులను వెనక్కి లాగడానికి బదులుగా వారిని ముందుకు నడిపించే వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తానని రాహల్? గాంధీ హామీ ఇచ్చారు.

"ఝార్ఖండ్ విద్యార్థులు– రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. విద్యార్థులు తమ నిరాహార దీక్షను విరమించారు. ఈ వార్త వినడం సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఝార్ఖండ్ ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుని పరిష్కారాన్ని కనుగొన్నారు. విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకున్నారు. ఇదే సరైన మార్గం. విద్యార్థులు ప్రశ్నలు అడిగినప్పుడు వారికి సమాధానాలు లభించాలి. మేము దేశంలోని ప్రతి విద్యార్థికి అండగా ఉంటాము. ప్రతి విద్యార్థికి వారి కష్టానికి తగిన ప్రతిఫలం, న్యాయమైన పోటీలో పాల్గొనేలా ఈ వ్యవస్థను పూర్తిగా మారుస్తాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

**జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ పరీక్ష రద్దు**

విద్యార్థుల డిమాండ్ల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే టీడీపీఎల్ సంస్థ నిర్వహించిన పరీక్షలు, వెలువడిన ఫలితాలు, ఆ ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన చర్యలన్నింటినీ రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2014 నుంచి రాష్ట్రంలో నిర్వహించిన వివిధ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రాంచీలోని సదర్ ఆసుపత్రిలో విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నిరాహార దీక్ష విరమించారు. రాష్ట్ర మంత్రులు దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ సమక్షంలో ఆయన దీక్షను ముగించారు. రాష్ట్రంలో నియామక పరీక్షల నిర్వహణ, పారదర్శకత, అవకతవకలపై విద్యార్థులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మహతో నిరాహార దీక్షకు దిగారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కీలక నిర్ణయాలు ప్రకటించడంతో ప్రభుత్వం–విద్యార్థుల మధ్య చర్చలు కొలిక్కి వచ్చాయి.

**జేపీఎస్‌సీ పరీక్షలపైనా విచారణ**

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. ఈ దర్యాప్తును రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఎస్ఐటీ, సీఐడీ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నాయని, విచారణలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయని సోరెన్ తెలిపారు. జేపీఎస్‌సీ ద్వారా నియమితులైన కొందరిని పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు చేసినట్లు కూడా పేర్కొన్నారు. యువత ప్రధానంగా జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలపై స్పష్టత కోరుతోందని సోరెన్ తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం తరఫున ఓ మంత్రి దర్యాప్తు జరుగుతోందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం చెప్పిందే సరైనదిగా అనిపిస్తుందని, మరికొన్ని సందర్భాల్లో విద్యార్థుల వాదనలో నిజం కనిపిస్తుందని అన్నారు. రెండు వైపుల వాదనల్లో వాస్తవాన్ని తేల్చేందుకు సమగ్ర విచారణ అవసరమని సీఎం పేర్కొన్నారు.

**పరీక్ష రద్దుతో కొత్తగా మరో ఆందోళన**

ఒకవైపు విద్యార్థుల ఆందోళనకు పరిష్కారం లభించినప్పటికీ, మరోవైపు జేఎస్ఎస్‌సీ–సీజీఎల్ ద్వారా ఇప్పటికే నియమితులైన ఉద్యోగులు కొత్త సమస్యను ఎదుర్కొంటున్నారు. పరీక్ష రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు ఉద్యోగులు రాంచీలోని ప్రాజెక్ట్ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని, తాత్కాలిక టార్పాలిన్ కింద నిలబడి నిరసన తెలిపారు. పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అధికారికంగా నియామక ఉత్తర్వులు పొందిన తర్వాత మొత్తం ప్రక్రియను రద్దు చేయడం తమను అన్యాయంగా శిక్షించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగ హోదాపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, పరీక్ష రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచి వ్యూహాలను పదును పెడుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లు, కో–ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను నియమించారు. కో–ఇన్‌ఛార్జ్‌గా జాతీయ కార్యదర్శి జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కు బాధ్యతలు అప్పగించారు. దేశ రాజకీయాల్లో కీలక రాష్ట్రంగా ఉన్న యూపీలో 2027 అసెంబ్లీ ఎన్నికల నేథ్యంలో సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై తావ్డే బృందం దృష్టి పెట్టనుంది. ఇక పంజాబ్ రాష్ట్ర భాజపా ఇన్‌చార్జ్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సతీశ్ పూనియాను నియమించారు. అలాగే గుజరాత్ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌కు అప్పగించారు. ఇతర రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌ల నియామకాలను త్వరలో చేపడతామని బీజేపీ తెలిపింది. అప్పటివరకు ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభారీ వ్యవస్థ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.

**కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం**

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను సోమవారం ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని రూపొందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మాజీ అమేఠీ ఎంపీ స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

**విస్తృత ప్రాతినిధ్యంతో జాతీయ కార్యదర్శులు**

జాతీయ కార్యదర్శుల నియామకాల్లోనూ దేశవ్యాప్తంగా భౌగోళిక ప్రాతినిధ్యానికి బీజేపీ ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కవితా పటీదార్, కేరళకు చెందిన కె. సురేంద్రన్, యూపీకి చెందిన డాక్టర్ భోలా సింగ్, ఝార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ వర్మ, గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్, దిల్లీకి చెందిన సందీప్ పాఠక్ తదితరులకు జాతీయ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించారు. నాగాలాండ్‌కు చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్, కేరళకు చెందిన అనిల్ ఆంటోనీ, తమిళనాడుకు చెందిన ఎం. వెంకటేశన్, పశ్చిమ్ బెంగాల్‌కు చెందిన మనోజ్ తిగ్గా, బిహార్‌కు చెందిన సిద్ధార్థ్ శంభు, దిల్లీకి చెందిన స్వదేశ్ సింగ్, అసోంకు చెందిన మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్‌కు చెందిన రోహన్ గుప్తా, దిల్లీకి చెందిన జై ప్రకాశ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

**కీలక విభాగాలకూ కొత్త బాధ్యతలు**

కేంద్ర ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన జాతీయ కోశాధికారి బాధ్యతలను పీయూశ్ గోయల్‌కు మరోసారి అప్పగించారు. తరుణ్ చుగ్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్‌కు చెందిన ఎంపీ హేమాంగ్ జోషికి యువ మోర్చా బాధ్యతలు ఇచ్చారు. మహిళా మోర్చా అధ్యక్ష బాధ్యతలను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరి చేపట్టనున్నారు. పార్టీ మీడియా విభాగంలో మాత్రం కొనసాగింపునకు ప్రాధాన్యం ఇచ్చారు. లోక్‌సభ సభ్యుడు అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. ఆయనకు సహ కన్వీనర్లుగా ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ మ్హాస్కేకు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.

పెన్ సత్తా
RNI:APTEL/2023/87729



## సంపాదకీయం

## మొక్కల మాయాజాలం!

అడవులను పునరుద్ధరించాలని పదేళ్ల క్రితం ప్రారంభించిన 'గ్రీన్ ఇండియా మిషన్' (జీఐఎం), తాను నిర్దేశించుకున్న లక్ష్యాల్లో దాదాపు ఏమీ సాధించలేకపోయిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పనితీరు తనిఖీ స్పష్టం చేసింది. ఆగస్టు 13న పార్లమెంటుకు సమర్పించిన ఈ నివేదిక ప్రకారం, 2015-16 నుంచి 2024-25 వరకూ 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మిషన్ అమలును కాగ్ పరిశీలించింది. అటవీ విస్తీర్ణాన్ని 14 లక్షల హెక్టార్లలో పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంటే, వాస్తవంగా సాధించింది కేవలం 34,090 హెక్టార్లు మాత్రమే -లక్ష్యంలో 97.57 శాతం తక్కువ! అటవీ నాణ్యతను మెరుగుపరచడంలోనూ 91.87 శాతం లోటు కనిపించింది. కేవలం సంఖ్యాపరమైన వైఫల్యమే కాదు, నివేదిక చేసిన మరో కీలక వెల్లడి మరింత ఆందోళనకరం. క్షేత్రస్థాయిలో పరిశీలించిన నమూనా ప్రాంతాల్లో దాదాపు 70 శాతం చోట్ల మిషన్ వల్ల ఎలాంటి గుర్తించదగిన మార్పూ కనిపించలేదని జీఐఎస్ ఆధారిత మదింపులో తేలింది. ఫలితాలను ధ్రువీకరించడానికి వాడిన కేఎంఎల్ ఫైళ్లు సరిగ్గా పరిశీలించకపోవడం వల్ల, నివేదించిన సాధనలు అతిశయోక్తిగా చూపబడ్డాయని కూడా ఆడిట్ గుర్తించింది. పరిశ్రమల నుంచి అటవీ భూమి మళ్లింపు కోసం సేకరించే నిధులను నిర్వహించే కాంపా (సీఏఎంపీఏ), గ్రామీణ వేతన కూలీని మొక్కలు నాటే పనులకు వినియోగించే గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఇప్పుడు వీబీ-గ్రామ్‌జీగా పేరు మార్చుకుంది) వంటి పథకాలతో సమన్వయం చేసుకోవాలని జీఐఎం భావించినా, అది ఆచరణలో ఎన్నడూ సాకారం కాలేదు. సరిపడా నిధులు లేకపోవడం, పథకాల మధ్య బలహీన సమన్వయం, నాసిరకం పర్యవేక్షణ -ఇవే ఈ వైఫల్యానికి ప్రధాన కారణాలుగా కాగ్ గుర్తించింది.

2008లో ప్రకటించిన జాతీయ వాతావరణ మార్పు కార్యాచరణ ప్రణాళిక (నాప్‌సీసీ)లోని ఎనిమిది మిషన్లలో జీఐఎం ఒకటి. 2030 నాటికి అదనంగా 250 నుంచి 300 కోట్ల టన్నుల కార్బన్ సింక్‌ను సృష్టిస్తామని పారిస్ ఒప్పందానికి భారత్ ఇచ్చిన హామీని నెరవేర్చే సాధనంగా దీన్ని రూపొందించారు. జీవవైవిధ్యం, జలవనరులు, కార్బన్ సీక్వెస్ట్రేషన్, ఆవాసాల పునరుద్ధరణ వంటి పర్యావరణ లక్ష్యాలే దీని ప్రేరణ. అయితే, ఇప్పుడు ఈ మిషన్ నిర్లక్ష్యానికి గురై, 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) పేరుతో 2024లో ప్రారంభమైన మొక్కలు నాటే కార్యక్రమం దాని స్థానాన్ని ఆచరణాత్మకంగా ఆక్రమించినట్టు కనిపిస్తోంది. ఇప్పటివరకూ 140 కోట్ల మొక్కలు నాటినట్టు ప్రభుత్వం ప్రకటించినా, తాజా అటవీ గణాంకాలు 'చెట్టు'కు, 'అడవి'కి మధ్య ఉన్న అగాధాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ 2023 ప్రకారం, పచ్చదనం 1,445 చదరపు కిలోమీటర్లు పెరిగినా, అందులో నిజమైన అడవి కేవలం 156 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మిగతా 1,289 చదరపు కిలోమీటర్లు 'నమోదిత అడవుల వెలుపలి చెట్ల కవర్' మాత్రమే.


నమోదిత అడవుల్లోనే దట్టమైన కేనోపీ క్రమంగా పొదలుగా క్షీణిస్తోంది. అంటే, భారత్ ఎక్కువగా మొక్కలు నాటుతోంది, తక్కువగా అడవులను పెంచుతోంది. ఆసక్తికరంగా, జీఐఎం నిధుల వినియోగం కూడా 2020-21 నుంచి నిరంతరం తక్కువగానే ఉంటూ వచ్చింది. 2025-26కు కేటాయించిన నిధుల్లో కేవలం 28 శాతం మాత్రమే వినియోగించగా, 2026-27కు కేటాయించిన మొత్తం కేవలం రూ.170 కోట్లకే పరిమితమైంది, ఇది మిషన్ ప్రాధాన్యతను ప్రభుత్వం ఎంత తగ్గించిందో స్పష్టం చేస్తోన్న అంశం.

ఈ సంక్షోభాన్ని అత్యంత స్పష్టంగా ప్రతిబింబించే ఉదాహరణ అరావళి పర్వతశ్రేణి వివాదం! దేశంలోనే అత్యంత క్షీణించిన శ్రేణిగా చెప్పదగిన అరావళిలో, గుట్టలు క్వారీయింగ్‌తో కరిగిపోగా, స్థానిక వృక్షజాలాన్ని ఆక్రమణదారు జాతి 'విలాయతీ కికర్' (ప్రాసోపిస్ జులిఫ్లోరా) కమ్మేసింది. ఇప్పుడు దీన్ని 'గ్రీన్ వాల్' పేరుతో కొత్త మొక్కలు నాటడం ద్వారా రక్షించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ, ఏళ్ల తరబడి సాగిన మైనింగ్ విధ్వంసాన్ని, ఆక్రమణలను, వేల సంవత్సరాలు పట్టి ఏర్పడిన పర్యావరణ వ్యవస్థను ఈ కొత్తగా నాటిన మొక్కలు తిరిగి తీసుకురాలేవు. పునరుద్ధరణ అంటే ల్యాండ్‌స్కేపింగ్ కాదు. అయితే, ఈ నివేదికను ఎలా చదవాలన్న దానిపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగ్ సాధనం అకౌంటింగ్ మాత్రమే. అది హెక్టార్లను, రూపాయలను లెక్కించగలదే తప్ప, సజీవ అడవి విలువను కొలవలేదని, మిషన్ అమలులో ఎదురయ్యే ఆచరణాత్మక సవాళ్లను ఎల్లప్పుడూ పూర్తిగా బంధించలేదని కొందరు వాదిస్తున్నారు. 2019-20 నుంచి 2023-24 మధ్య కాంపా కింద రూ.38,516 కోట్లు రాష్ట్రాలకు ఆమోదం పొందగా, అందులో రూ.26,001 కోట్లు వినియోగించినట్టు గణాంకాలు చూపుతున్నాయని, జీఐఎంను వ్యాపక అటవీకరణ కార్యక్రమాల మొత్తం సందర్భంలో చూడాలని, ప్రక్రియాపరమైన వైఫల్యాలకు, ఫలిత వైఫల్యాలకు మధ్య తేడా గుర్తించాలని, ఆడిట్ నివేదిక సమర్పణకు ఏడాది ముందే ప్రభుత్వం సవరించిన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించిందని కొందరు విశ్లేషకులు ఎత్తిచూపుతున్నారు. అయినప్పటికీ, కాగ్ తీర్పు తన బరువును కోల్పోదు. భారత్ అడవులను పునరుద్ధరించే మిషన్‌ను నీరసించనిస్తూ, ప్రభుత్వం మాత్రం చెట్లను లెక్కించడంలోనే బిజీగా ఉండటం, జాతీయ వాతావరణ లక్ష్యాలపైనే కాకుండా, పర్యావరణ పరిరక్షణపై విధాన నిబద్ధతపైనే తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. కేవలం మొక్కలు నాటడం మాత్రమే సరిపోదు, నాటిన ప్రతి మొక్క ఎదిగి, జీవవైవిధ్యంతో కూడిన సజీవ అటవీ వ్యవస్థగా రూపాంతరం చెందేలా దీర్ఘకాలిక సంరక్షణ, పర్యవేక్షణ, జవాబుదారీతనం అవసరమని ఈ నివేదిక గట్టిగా గుర్తుచేస్తోంది.

అడవి అంటే కేవలం భూమిపై నాటిన మొక్కల సంఖ్య కాదు. అది వృక్షాలు, జంతువులు, నేల, జలవనరులు కలిసి ఏర్పరచుకునే ఒక సజీవ వ్యవస్థ. ఈ వ్యత్యాసాన్ని గుర్తించకుండా, కేవలం మొక్కలు నాటిన సంఖ్యనే విజయ గీటురాయిగా చూపుతూ ముందుకు సాగితే, భారత్ తన వాతావరణ లక్ష్యాలను కాగితాలపై చేరుకున్నా, వాస్తవంలో అడవుల కోల్పోతున్న జీవవైవిధ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను తిరిగి పొందలేకపోవచ్చు. దీర్ఘకాలిక సంరక్షణ, జవాబుదారీతనంతో కూడిన నిజమైన అటవీ పునరుద్ధరణ దిశగా ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది!!

---

## పనికొచ్చే పలుకు



## క్షమాగుణాన్ని మించినదేది!?

మనిషి జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లలో అత్యంత కష్టతరమైనది -తనకు హాని చేసినవారిని క్షమించడం! ఇది కేవలం నైతిక ఉపదేశం కాదు.. జీవన శైలిని సమూలంగా మార్చే గొప్ప సూత్రం. సుమతీ శతకకారుడు బద్దెన ఈ ప్రాపంచిక సత్యాన్ని ఎంతో అందంగా ఇలా చెప్పాడు:

**"ఉపకారికి నుపకారము/ విపరీతము గాదు సేయ వివరింపంగా,**
**అపకారికి నుపకారము/ నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!"**

మనకు మేలు చేసినవారికి తిరిగి మేలు చేయడం సహజం. ఇందులో గొప్పతనమేమీ లేదు. ఇది ప్రతి మనిషిలోనూ సహజంగా ఉండే స్పందన. కానీ నిజమైన మనోబలం, నిజమైన నేర్పు అనేవి బయటపడేది తనకు కీడు చేసినవారిపట్ల మనం ఎలా ప్రవర్తిస్తామన్న దానిలోనే. గతంలో వారు చేసిన తప్పులను గుర్తు చేస్తూ, పగతో రగిలిపోతూ బతకడం సులభమే. కానీ ఆ తప్పులను పక్కనపెట్టి, ద్వేషాన్ని విడనాడి, అవసరమైతే వారికి సహాయం చేయగలిగే మనస్తత్వం అలవర్చుకోవడమే అసలైన జీవన కళ.

ఈ ఆలోచనను నేటి జీవనశైలికి అన్వయించుకుంటే, దీని విలువ మరింత స్పష్టమవుతుంది. మనం రోజువారీ జీవితంలో ఎంతోమందితో సంబంధాలు కొనసాగిస్తుంటాం... కుటుంబంలో, స్నేహితుల మధ్య, కార్యాలయంలో. ఈ సంబంధాల్లో అపార్థాలు, గొడవలు, నొప్పించే మాటలు సహజం. అయితే వీటిని మనసులో పెట్టుకుని, ప్రతీకారేచ్ఛతో బతకడం మొదలుపెడితే, అది మనల్ని లోలోపల కుంగదీస్తుంది. మానసిక ఆరోగ్యంపై దీని ప్రభావం అపారం. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమివంటి సమస్యలకు మూలకారణంగా తరచూ కనిపించేది ఈ అణిచిపెట్టిన కోపమే. దీనికి విరుగుడు క్షమాగుణమే. ఎవరైనా మనల్ని నొప్పించినా, వారి తప్పులను పదేపదే గుర్తుచేసుకోకుండా ముందుకు సాగగలిగితే, మనసు తేలికవుతుంది. ఇది బలహీనత కాదు -అసలైన శక్తి. ఎందుకంటే క్షమించడానికి ధైర్యం కావాలి, సహనం కావాలి, ఔన్నత్యం కావాలి!

ఈ సూత్రాన్ని వృత్తిపరమైన జీవితంలోకి తీసుకువస్తే కూడా దాని ప్రయోజనం స్పష్టమవుతుంది. తోటి ఉద్యోగి ఒకసారి తప్పు చేసినా, అతనితో శత్రుత్వం పెంచుకోకుండా సహకరించే మనస్తత్వం ఉన్నవారే బృందంలో నిజమైన నాయకులుగా ఎదుగుతారు. కుటుంబ సంబంధాల్లో కూడా, భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు-పిల్లల మధ్య చిన్న చిన్న అపార్థాలు వచ్చినప్పుడు, పాత తప్పులను తిరిగి తిరిగి ప్రస్తావించకుండా ముందుకు సాగే గుణం ఆ బంధాలను బలపరుస్తుంది. దీనికి విరుద్ధంగా, ప్రతి చిన్న విషయాన్ని లెక్కపెడుతూ, పాత గాయాలను రేపుతూ ఉంటే, ఎంత బలమైన బంధమైనా చివరికి బీటలువారుతుంది.

ఈ పద్యంలోని మరో సూక్ష్మమైన అంశం ఏమిటంటే.. -"నెపమెన్నక" అనే పదం. అంటే, ఉపకారం చేసేటప్పుడు కూడా ఆ వ్యక్తి గతంలో చేసిన తప్పులను ఎత్తిచూపకుండా చేయాలన్నది. కేవలం క్షమించడమే కాదు, ఆ క్షమను గొప్పగా చాటుకోకుండా, సహజంగా, నిష్కల్మషంగా ఆచరించడమే అసలైన ఔన్నత్యం. ఎందుకంటే క్షమించి కూడా ఆ విషయాన్ని పదేపదే గుర్తుచేస్తూ ఉంటే, అది నిజమైన క్షమ కాదు -అది మరో రూపంలో ఉన్న అహంకారమే.

జీవితంలో ప్రశాంతత, సంతోషం కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ సూత్రాన్ని ఆచరించి చూడాలి. ఇతరుల తప్పులను క్షమించడం వల్ల మనకు కలిగే మానసిక ప్రశాంతతే అంతిమంగా మన జీవన నాణ్యతను నిర్ణయిస్తుంది. కీడుకు ప్రతీకారంతో బదులివ్వడంకంటే, మేలుతో స్పందించడమే నిజమైన బలం, నిజమైన సంస్కారం అని సుమతీ శతకకారుడు శతాబ్దాల క్రితమే మనకు బోధించారు. నేటికీ ఆ మాట అంతే వర్తిస్తుంది, అంతే విలువైనది!

---

# రెక్కలల్లార్చిన భోగాపురం!

ఉత్తర ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో సోమవారం నూతన అధ్యాయం ఆరంభమైంది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వాణిజ్య సర్వీసులు ప్రారంభించిన తొలిరోజే ఏకంగా 52 విమాన రాకపోకలతో సందడి నెలకొంది. ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ అభివృద్ధి చేసి నిర్వహిస్తోంది. హైదరాబాద్ నుంచి ఇండిగో తొలి విమానం రాగా, అబుధాబి, సింగపూర్ నుంచి అంతర్జాతీయ సర్వీసులు కూడా మొదలయ్యాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఎంఆర్‌వో సదుపాయం, భారీ కార్గో టెర్మినల్, ఏరోసిటీ వంటి ప్రణాళికలతో భోగాపురం భవిష్యత్తులో తూర్పు తీరపు ఏరోస్పేస్ కేంద్రంగా ఎదిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. దశాబ్దానికిపైగా చంద్రబాబు నాయుడు ఊహించిన ఈ దార్శనికత, ఇప్పుడు ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థనే పునర్నిర్వచించే దిశగా అడుగులేస్తోంది.




ఉత్తర ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అధికారికంగా వాణిజ్య సర్వీసులను ప్రారంభించిన తొలిరోజే ఏకంగా 52 విమాన రాకపోకలతో సందడి నెలకొంది. దేశీయ ప్రధాన కేంద్రాలతోపాటు మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా అంతర్జాతీయ గమ్యస్థానాలకూ కొత్త గేట్‌వే అనుసంధానతను అందించింది. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్) అభివృద్ధి చేసి నిర్వహిస్తోంది. "భోగాపురంలో విమానాశ్రయం ప్రారంభం ఆంధ్రప్రదేశ్‌కు అనుసంధానతలో చారిత్రక శకానికి తెరతీస్తోంది. యువత ఆకాంక్షలకు బలం చేకూర్చి, విస్తృత ఆర్థిక అవకాశాలను తెరుస్తోంది" అని సీఎం చంద్రబాబు నాయుడు 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వయంగా ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు, జ్ఞాపికలు అందజేస్తూ ఈ చారిత్రక ఘట్టానికి ప్రాధాన్యతను చేకూర్చారు. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పైస్‌జెట్, ఇండియావన్ సంస్థల విమానాలు తొలిరోజు సాంప్రదాయ వాటర్ కెనన్ సెల్యూట్‌తో స్వాగతం పొందాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఇండిగో 6ఈ 6408 విమానం తొలి రాకగా చరిత్రకెక్కగా, అబుధాబి నుంచి 6ఈ 1443 విమానం రాకతో అంతర్జాతీయ కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. సింగపూర్ నుంచి స్కూట్ టీఆర్ 784 విమానం దిగడం, భోగాపురం తొలిరోజు నుంచే గ్లోబల్ కనెక్టివిటీని అందుకున్న సూచనగా నిలిచింది.

కేవలం తొలిరోజు గణాంకాలే కాదు, భోగాపురం భవిష్యత్తు సామర్థ్యాన్ని పరిశీలిస్తే ఇది సమీప కాలంలోనే తన లక్ష్యాలను మించి ఎదిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2,200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ విమానాశ్రయం, బోయింగ్ 777, 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330, ఏ350 వంటి వైడ్-బాడీ విమానాలను నిర్వహించగల 3,800 మీటర్ల కోడ్-4ఈ రన్‌వేను కలిగి ఉంది. ప్రస్తుతం వార్షికంగా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో ప్రారంభమైనా, భవిష్యత్తులో 4 కోట్లమందికి పైగా విస్తరించే ప్రణాళిక ఇప్పటికే సిద్ధంగా ఉంది. అంతకుమించి, ఈ ప్రాజెక్టులో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంశం -500 ఎకరాల ఏవియేషన్ హబ్‌లో భాగంగా 25 ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) సదుపాయాన్ని నిర్మించాలన్న ప్రణాళిక. ఇది సాకారమైతే, తూర్పు తీరంలో భోగాపురం ఏరోస్పేస్ కేంద్రంగా మారి, అంతర్జాతీయ విమానయాన, రక్షణ తయారీ సంస్థలను ఆకర్షించే అవకాశం ఉంది. అంతేకాక, 25,000 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంగల కార్గో టెర్మినల్, ఔషధాలు, సముద్ర ఉత్పత్తులువంటి అధిక విలువ కలిగిన నశ్వర వస్తువుల కోసం ప్రత్యేక కోల్డ్ చైన్ సదుపాయాలనూ అభివృద్ధి చేస్తున్నారు. విశాఖపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానం చేయడం ద్వారా, భోగాపురాన్ని తూర్పు తీరంలో ప్రధాన ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం. ఇండియాలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఇది ఒకటి. కేవలం 31 నెలల్లో, నిర్దేశిత గడువుకన్నా ఐదు నెలలు ముందుగానే పూర్తి కావడం విశేషం. ఏవియేషన్ యూనివర్సిటీ, ఎడ్యుసిటీ, ఏరోసిటీ వంటి అనుబంధ ప్రాజెక్టులు కూడా సమాంతరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి కేవలం విమానాశ్రయాన్ని దాటి, మొత్తం విశాఖపట్నం-భోగాపురం గ్రోత్ కారిడార్‌ను దేశంలోనే అగ్రగామి ఆర్థిక, పారిశ్రామిక కారిడార్లలో ఒకటిగా మార్చాలన్న విస్తృత దార్శనికతను ప్రతిబింబిస్తున్నాయి.

అయితే, ఇంతటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభ దశలో సహజంగానే కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. సిరిపురానికి చెందిన ఒక ప్యాసింజర్ తన అనుభవాన్ని పంచుకుంటూ, తెల్లవారుజామునే బయలుదేరిన తన ప్రయాణంలో ఆనందపురం జంక్షన్ వద్ద తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, విమానాశ్రయంలోకి అడుగుపెట్టిన తర్వాత అద్భుతంగా ఉండి, సుదీర్ఘ ప్రయాణాన్ని భర్తీ చేసిందని పేర్కొన్నారు. నగరం నుంచి శివారు ప్రాంతంలోని ఈ కొత్త విమానాశ్రయానికి మధ్య దూరాన్ని తగ్గించేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఇప్పటికే 'ఏరో ఎక్స్‌ప్రెస్' పేరుతో ఏసీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ప్రారంభించింది. తొలిరోజే 14 ఈ-బస్సులు రెండు ప్రధాన మార్గాల్లో ఉదయం 4:30 నుంచి రాత్రి 10:30 వరకు నడుస్తున్నాయి. ఇలాంటి అనుసంధాన సవాళ్లను ముందుచూపుతో పరిష్కరిస్తున్న తీరు, ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థ కేవలం విమానాశ్రయాన్ని నిర్మించడమే కాకుండా, ప్రయాణికుల అనుభవాన్ని సమగ్రంగా మెరుగుపరచడంపైనా దృష్టి సారించాయని స్పష్టం చేస్తుంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ అనే ప్రధాన విమానయాన కేంద్రాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు, ఇన్ని ఏళ్ల తర్వాత తనదైన పూర్తిస్థాయి అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం లభించడం విభజనానంతర ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక మలుపు! దశాబ్దానికిపైగా చంద్రబాబు నాయుడు ఊహించిన ఈ దార్శనికత, ఇప్పుడు వాస్తవ రూపం దాల్చడం యాదృచ్ఛికం కాదు. ఇది స్థిరమైన ప్రణాళిక, సకాలంలో అమలు ఫలితమే. తొలిరోజు 52 సర్వీసులతో మొదలైన ఈ ప్రయాణం, భవిష్యత్తులో ఎంఆర్‌వో, కార్గో, ఏరోసిటీ, ఏవియేషన్ యూనివర్సిటీ వంటి అనుబంధ ప్రాజెక్టులు పూర్తయ్యే కొద్దీ, కేవలం ఒక విమానాశ్రయంగా కాకుండా యావత్ ఉత్తర ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థనే పునర్నిర్వచించే శక్తిమంతమైన చోదకశక్తిగా ఎదగనుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ■

---



స్నేహం అంటే గొప్ప మాటలు కాదు -కలిసి నవ్విన క్షణాలు, పంచుకున్న చిన్న ఆనందాలు. రోజువారీ జీవితంలో మనం పెద్ద విషయాల వెంట పరిగెడుతూ, చిన్న చిన్న ఆనందాలను మర్చిపోతుంటాం. కానీ నిజానికి, హృదయానికి నిజమైన విశ్రాంతి దొరికేది ఆ చిన్న క్షణాల్లోనే.. ఒక స్నేహితుడితో పంచుకున్న నవ్వులో, ఓ చిన్న మాటలో, ఓ చిరు జ్ఞాపకంలో. అలాంటి క్షణాలే మనసుకు కొత్త ఉదయాన్ని, కొత్త శక్తిని ఇస్తాయి. అందుకే స్నేహాన్ని, దాంట్లోని చిన్న ఆనందాలను జీవితంలో ఎప్పుడూ కాపాడుకోవాలి.

-మహాదేవ

---

## వింతల్లో వింతలు

## హిమక్రీము.. రుచే వేరు!



జపాన్‌లో ఐస్‌క్రీమ్ ప్రియులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది ఒక వింత రుచి. ఇవాటే ప్రిఫెక్చర్‌లోని 'మిచినో-ఏకి యామడ' అనే రోడ్‌సైడ్ డైనర్, గుల్లలతో తయారు చేసిన సాఫ్ట్-సర్వ్ ఐస్‌క్రీమ్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యామడ బే నుంచి తీసుకొచ్చిన తాజా సముద్ర గుల్లలను, మృదువైన పాల ఐస్‌క్రీమ్‌పై అలంకరించి, పైన సోయా సాస్ చిలకరించి వడ్డిస్తున్నారు. "సముద్ర తాజాదనం -తీపి పాలు -ఉప్పటి సోయా సాస్" కలయిక రుచి మొగ్గలను షాక్‌కు గురిచేస్తుందని రుచి చూసినవారు చెబుతున్నారు. ఈ వింత డెజర్ట్ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా, "ఇది ఏఐ సృష్టేమో" అని కొందరు నెటిజన్లు నమ్మలేకపోతున్నారు. కేవలం 600 యెన్ (సుమారు రూ.300)కే లభించే ఈ వింత కోన్‌ను ఈ వేసవి అంతా అందించనున్నట్టు యాజమాన్యం తెలిపింది. ఇప్పటికే మాచా, రామెన్ సాఫ్ట్-సర్వ్ వంటి వింత రుచులతో పేరున్న జపాన్, ఇప్పుడు ఈ గుల్ల ఐస్‌క్రీమ్‌తో మరోసారి ఆసక్తి రేపుతోంది.



# జ్యోతికి మళ్లీ నిరాశే

ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సహా 9 పతకాలు.. ప్రపంచకప్ ఫైనల్స్‌లో రెండు రజతాలు.. ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు సహా 5 పతకాలు.. ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఏడు స్వర్ణాలు సహా 14 పతకాలు.. ప్రపంచకప్‌లో 12 స్వర్ణాలు సహా 27 పతకాలు.. ఇలా అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సాధించిన ఘనతలు ఎన్నెన్నో. అయినా ఇప్పటిదాకా దేశ అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్న మాత్రం దక్కలేదు. 2017లో ఆమెకు అర్జున అవార్డు ఇచ్చిన కేంద్రం.. ఖేల్‌రత్నకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆ పురస్కారానికి ఎంపిక చేయలేదు. గతంలో గట్టి పోటీ ఉండడం వల్ల సురేఖకు ఈ అవార్డు ఇవ్వలేదన్న వాదన ఉండేది. ఈసారి పోటీ తక్కువగా ఉన్నప్పటికీ ఆమెను ఎంపిక చేయలేదు. అవార్డుల కమిటీ ఖేల్‌రత్నకు ఎవరినీ ఎంపిక చేయకుండా వదిలేసిందే తప్ప.. జ్యోతి సురేఖకు అవార్డును ప్రకటించలేదు. అయితే ఈసారి ఆమెకు అవార్డు ఇవ్వడంపై చర్చ మాత్రం జరిగినట్లు తెలుస్తోంది. జ్యోతితో పాటు హాకీ స్టార్ హార్దిక్ సింగ్.. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానల పేర్లను పరిశీలించిన కమిటీ.. చివరికి ఎవరినీ అవార్డుకు ఎంపిక చేయలేదు.

# భారత్ విజయం లాంఛనమే!!

- భారత్ రెండో ఇన్నింగ్స్‌లో193కి ఆలౌట్
- 372.. శ్రీలంక ముందు భారీ లక్ష్య ఛేదన
- గెలుపుకు ఆరు వికెట్ల ముంగిట భారత్
- శ్రీలంక విజయానికి 288 పరుగులు
- గెలుపుకు చివరి రోజు మిగిలిన ఆట




శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రబాత్ జయసూర్య(3/43) మూడు వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.



# హాకీ ప్రపంచ కప్.. భారత మహిళల ఘన విజయం!

- దక్షిణాఫ్రికాపై 6-1తో భారత జట్టు జైత్రయాత్ర
- టోర్నీలోనే టీమిండియాకు అతిపెద్ద గెలుపు
- సమష్టిగా రాణించిన ఫార్వర్డ్, డిఫెన్స్ విభాగాలు
- పూల్-డిలో మరింత పటిష్టమైన భారత్ స్థానం



మహిళల హాకీ ప్రపంచ కప్ 2026లో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. పూల్-డి రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 6-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. మ్యాచ్ ఆరంభం నుంచే ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత క్రీడాకారిణులు వరుస గోల్స్‌తో విరుచుకుపడ్డారు.

### ఆరంభం నుంచే జోరు..

మ్యాచ్ 11వ నిమిషంలో సునేలిటా టోప్పో గోల్ చేసి భారత్‌కు అదిరిపోయే శుభారంభం అందించింది. సర్కిల్‌లోకి వచ్చిన బంతిని అందుకున్న టోప్పో ఎలాంటి పొరపాటు చేయకుండా నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపింది. దక్షిణాఫ్రికా రక్షణ విభాగం చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారత్ తొలి ఆధిక్యాన్ని సాధించింది.

### గోల్స్ వర్షం కురిపించిన భారత్..

రెండో క్వార్టర్‌లోనూ భారత మహిళలు తమ దూకుడు కొనసాగించారు. నవనీత్ కౌర్, సుశీలా చాను చెరో గోల్ సాధించడంతో భారత్ పటిష్ట స్థితికి చేరింది. మూడో క్వార్టర్‌లో భారత జోరు మరింత పెరిగింది. దీపిక, లాల్‌రెమ్సియామి, రాణా సాక్షి వరుసగా ఒక్కో గోల్ నమోదు చేయడంతో భారత్ ఆధిక్యం 6-0కు చేరింది. మ్యాచ్ పూర్తిగా భారత్ చేతుల్లోకి వెళ్లడంతో దక్షిణాఫ్రికా జట్టు తిరిగి పుంజుకునే అవకాశం లేకుండా పోయింది.

### పూల్-డిలో తిరుగులేని స్థానం..

చివరి క్వార్టర్‌లో దక్షిణాఫ్రికా ఒక గోల్ సాధించి భారత ఆధిక్యాన్ని స్వల్పంగా తగ్గించింది. అయితే అప్పటికే మ్యాచ్ పూర్తిగా భారత్ వైపు ఉండటంతో ఆ గోల్ ఎలాంటి ప్రభావం చూపలేదు. చివరకు భారత్ 6-1తో భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో పూల్-డి పోటీలో భారత జట్టు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో భారత ఫార్వర్డ్ లైన్, డిఫెన్స్ విభాగాలు రెండూ సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించాయి.



# గాయత్రీ , శ్రీకాంత్ లకు అర్జున అవార్డు..

### మొత్తం 17 మందికి ఈ పురస్కారాలు

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. జాబితాలో నిలిచారు.

# సంక్రాంతి ఓకే.. మరి భోగి సంగతేంటి శర్వా?



'టాక్సిక్' మ్యూజిక్ లాంచ్ ఈవెంట్‌లో ఆకర్షణీయమైన పసుపు రంగు దుస్తుల్లో మెరిసిపోయిన రుక్మిణి వసంత్

శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న 'భోగి'ని ఆగస్టు 28న విడుదల చేస్తామని గతంలో అధికారికంగా అనౌన్స్ చేశారు. అయితే రిలీజ్ సమయానికి కేవలం రెండు వారాలు మాత్రమే మిగిలి ఉండటంతో అసలు సినిమా చెప్పిన తేదీకి వస్తుందా లేదా అనే ప్రశ్నలు మొదలయ్యాయి. పాన్ ఇండియా స్థాయిలో ప్లాన్ చేసిన భారీ చిత్రానికి ఈ సమయానికి పబ్లిసిటీ ఓ రేంజ్ లా నడవాలి. కానీ మేకర్స్ నుంచి ఎలాంటి పెద్ద ప్రమోషనల్ అప్‌డేట్స్ సౌండ్ అయితే లేదు.దర్శకుడు సంపత్ నంది రీసెంట్ గా ఒక భారీ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేసుకున్నామని సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. అయితే ఆ పోస్ట్‌లో రిలీజ్ డేట్ గురించి ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. ఇప్పటికే ఈ చిత్రం కోసం 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో ఏకంగా 22 రోజుల పాటు ఒక భారీ క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను పూర్తి చేశారు. ప్రొడక్షన్ పనులు చురుగ్గానే సాగుతున్నా, థియేటర్లలోకి రావాల్సిన తేదీ దగ్గర పడుతుండటంతో ఆడియన్స్‌లో మాత్రం సస్పెన్స్ కొనసాగుతోంది. 1960ల నాటి తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాలో శర్వానంద్ 'గంగా' అనే సరికొత్త రగ్గడ్ పాత్రలో కనిపించబోతున్నాడు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి ఇందులో హీరోయిన్లుగా నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయాలనే ప్లాన్ ఉండటంతో సరైన బజ్ రావాల్సిన అవసరం కనిపిస్తోంది.ఇదిలా ఉంటే, శర్వానంద్ తన తర్వాతి ప్రాజెక్ట్‌ను మాత్రం చాలా వేగంగా లైన్‌లో పెట్టేశాడు. శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందనున్న 'జార్జ్ క్రిష్' సినిమాను రీసెంట్‌గా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 14న సంక్రాంతి పండుగ బరిలో నిలపబోతున్నట్లు ముందే పక్కాగా ప్రకటించారు. ఫెస్టివల్ సీజన్‌ను టార్గెట్ చేస్తూ రిలీజ్ డేట్ విషయంలో చిత్ర యూనిట్ చాలా ప్లానింగ్‌తో ఉంది.ఈ రెండు కథలు కూడా ఒకదానితో ఒకటి అస్సలు సంబంధం లేని పూర్తి భిన్నమైన జోనర్లు. ఒకవైపు యాక్షన్, రా లుక్‌తో సాగే పాన్ ఇండియా పీరియడ్ సినిమా చేస్తుంటే, వెంటనే మరోవైపు కుటుంబ ప్రేక్షకులను నవ్వించే పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెట్ చేసుకున్నాడు. ఒక నటుడిగా ఇలాంటి వైవిధ్యమైన లైనప్ సెట్ చేసుకోవడం ఆయన కెరీర్‌కు మంచి ప్లస్ పాయింట్.అయితే వచ్చే ఏడాది సంక్రాంతి సినిమాకు పక్కా డేట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి చేతిలో ఉన్న 'భోగి' పరిస్థితిపైనే అందరి కళ్లు ఉన్నాయి. అధికారికంగా తేదీ మారలేదు కాబట్టి చెప్పిన సమయానికే వస్తుందా లేక కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తారా అనేది చిత్ర యూనిట్ తేల్చాల్సి ఉంది. పండుగ రేసును ముందే లాక్ చేసుకున్న శర్వా, ఈ పీరియడ్ డ్రామాతో ఎప్పుడు బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తాడో చూడాలి.






బాక్సింగ్ స్ఫూర్తితో సోనమ్ బాజ్వా బోల్డ్ లుక్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com